మంగళవారం
10-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 80
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ముగ్గురు ఆంధ్రులకు అవార్డులు

న్యూఢిల్లీ: దేశంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వినూత్న రీతుల్లో ఫలితాలు సాధిస్తున్న ప్రముఖులకు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది అవార్డులు ప్రదానం చేశారు. 'ఔట్‌లుక్ ఇండియా' దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వారికి ఈ అవార్డులు దక్కాయి. సోమవారం ఔట్‌లుక్ అగ్రిటెక్ సమ్మిట్, అవార్డుల కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి ఈ అవార్డులు వచ్చాయి. యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం తరపున శాస్త్రవేత్త డా.గూడూరి ధనలక్ష్మి అవార్డు అందుకున్నారు. అనకాపల్లి కొందంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో షేక్ యాకిరిని అవార్డు వరించింది. సహజ పద్ధతుల్లో మిల్లెట్స్‌తో బిస్కెట్లు తయారు చేస్తోన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన తమ్మినేని మురళీకృష్ణ అవార్డు దక్కించుకున్నారు.

విధుల్లో చేరాల్సిందే

నేటి సాయంత్రం వరకు గడువు: సుప్రీం

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ పశ్చిమ బెంగాల్‌లో విధులు బహిష్కరిస్తూ ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. వైద్యులు విధుల్లో చేరేందుకు బెంగాల్ ప్రభుత్వం విధించిన గడువు సోమవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గడువును పొడిగించింది. మంగళవారం సాయంత్రంలోగా విధులకు హాజరుకావాలని... లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైద్యురాలి

- మిగతా 2 లో

బీమాపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాయిదా

న్యూఢిల్లీ: జీవిత, ఆరోగ్య బీమాకు సంబంధించి జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని జీఎస్టీ కౌన్సిల్ వాయిదా వేసింది. ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీ తగ్గించేందుకు మండలిలో ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ... తదుపరి భేటీలో దీనిపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై విస్తృత చర్చ జరిగింది. జీవిత, ఆరోగ్య, రీ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభనష్టాలను ఫిట్‌మెంట్ కమిటీ కౌన్సిల్ ముందుంచింది. దీనిపై సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ... తదుపరి భేటీలో దీనిపై నిర్ణయం వెలువడనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

భారత్‌లో మంకీపాక్స్ నిర్ధారణ

న్యూఢిల్లీ: భారత్‌లో మంకీపాక్స్ కేసు నిర్ధారణ అయింది. విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడి నమూనాలు పరీక్షించగా... అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్-2 రకంగా తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ప్రకటించి ఆత్యయిక స్థితికి కారణమైన క్లేడ్-1 కాదని, ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. బాధితుడి ఆరోగ్యం నిలకడగానే

- మిగతా 2 లో

కోలుకునేదెలా?

అంచనాలకందని నష్టం | **కట్టుబట్టలతో మిగిలిన బాధితులు**

- వరద బీభత్సంపై మూడురోజుల గణన ప్రారంభం
- ఇళ్లకు తిరిగిరాని వారి సంగతేంటి?
- గడువు పెంచితేనే అందరికీ న్యాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదలతో ముంపు ప్రాంత ప్రజలు సర్వం కోల్పోయారు. ఈ నష్టం ఎంతనేదీ అంచనాలకు అందడం లేదు. ముంపునకు కారణమైన బుడమేరు మూడు గట్ల పూడ్చివేతను ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. వరద ముంపు బాధితులకు సేవా కార్యక్రమాల్ని యుద్ధప్రాతిపదికన చేపట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నష్టం అంచనాలపైనే అధికార యంత్రాంగం ప్రధాన దృష్టి పెట్టింది. సోమవారం నుంచి ప్రారంభమైన నష్టం గణన ఈనెల 11వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. 1,700 అధికార బృందాలను కేటాయించి నష్టంపై అంచనాలు వేస్తున్నారు. ప్రతి సచివాలయంలో ఒక ఐఏఎస్ అధికారి, జిల్లా స్థాయి అధికారి, స్థానిక ప్రజా ప్రతినిధి పర్యవేక్షిస్తారు. విజయవాడ నగరంలోని 149 వార్డు సచివాలయాల పరిధిలో 2.50లక్షల మంది ఇళ్లకు వెళ్లి నష్టాన్ని లెక్కించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో విజయవాడ రూరల్ మండలంలో మరో ఐదు గ్రామాల్లో కూడా నష్టం లెక్కలు వేస్తారు. ప్రతి వార్డు సచివాలయానికి 10 గణన బృందాలు ఉంటాయి. వారు ఇంటింటి సర్వే నిర్వహించి గృహస్తుల నుంచి అవసరమైన సమాచారం తీసుకుంటారు. ఇందుకోసం ఇప్పటికే 1400 మందికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే వర్షాలు, వరదల వల్ల మొత్తం రూ.6,882 కోట్లు నష్టం వాటిల్లినట్లుగా ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసి... నివేదికను కేంద్రానికి పంపారు.

దుస్తులు, గృహోపకరణాలు వరదపాలు

బుడమేరు వరద ప్రభావం ప్రధానంగా విజయవాడ నగరంపైనే చూపింది. పది రోజులపాటు ముంపు నీటిలోనే చాలా కాలనీలు తేలియాడినంత పనైంది. సింగ్‌నగర్, కృష్ణాహోటల్ సెంటర్, వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, పాయకాపురం, ప్రశాంతినగర్, సుందరయ్యనగర్, కండ్రిక,రాజీవ్‌నగర్, జక్కంపూడి కాలనీ, అంబాపురం తదితర ప్రాంత వాసులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. వారి ఇళ్లు, దాబాలు పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతినడంతో పాటు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ఆహారం, మంచినీరు లేక అలమటించిపోయారు. ఇంట్లోని

- మిగతా 2 లో

విషం చిమ్మడమే వైసీపీ పని

జగన్‌పై సీఎం చంద్రబాబు ధ్వజం

ముంపు ప్రాంతాల్లో 9వ రోజూ పర్యటన

అన్నివిధాలా ఆదుకుంటామని బాధితులకు భరోసా

రాష్ట్ర ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో 9వ రోజూ విస్తృతంగా పర్యటించారు. బాధితులతో మాట్లాడి ఓదార్చారు.

6లో

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

పోటెత్తిన వరద

జనజీవనం అస్తవ్యస్తం

- అల్లూరి జిల్లాలో కొండచరియలు విరిగిపడి యువతి మృతి
- తీరం దాటిన తీవ్ర వాయుగుండం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం / పాడేరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఒడిశాకు దగ్గరలో పూరి వద్ద తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అయితే ఎగువ నుండి వచ్చిన వరద పోటుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరి పంటలు నీట మునిగాయి. ఏజెన్సీలో అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. అనకాపల్లి జిల్లాలో అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాగునీటి ప్రాజెక్టులను జిల్లా కలెక్టర్ అధికారులు పరిశీలించి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. విజయనగరం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద నీరు ప్రవహిస్తూనే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నాగావళి ఉధృతి కొనసాగుతుండగా... విశాఖ జిల్లాలో కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. భీమిలి నియోజకవర్గంలో కొన్ని ఇళ్లు నేలమట్టమ య్యాయి. పద్మనాభం మండలంలో ఓ పాఠశాల ప్రమాదకరంగా ఉండడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దగ్గరుండి జేసీబీతో కూల్చివేత పనులు చేయించారు. సోమవారం ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయ నగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో వర్షాలు తగ్గినప్పటికీ వరద పోటు తగ్గలేదు. అరకు- విశాఖపట్నం వచ్చే ఘాట్ రోడ్లలో కూడా కొండచరియలు విరిగిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండచరియలను తొలగించాలని గిరిజన

- మిగతా 2 లో

కొల్లేరు కకావికలం

వరద గుప్పెట్లో గ్రామాలు

- బాహ్యప్రపంచంతో తెగిన సంబంధాలు
- నీట మునిగిన వన్యప్రాణి సంరక్షణ కేంద్రం
- పునరావాస కేంద్రాలకు బాధితులు
- మూగజీవాల మౌనరోదన

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు/ కుక్కునూరు/ఏలేశ్వరం: కొల్లేరు సరస్సును వరద నీరు చుట్టుముడుతోంది. గత నాలుగో రోజులుగా బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, వాగులు, వంకల నుంచి వరద నీరు కొల్లేరులోకి ప్రవహిస్తుండడంతో నీటి ఉధృతి అధికంగా ఉంది. గంట గంటకు నీటిమట్టం పెరుగుతుండడంతో... నడిబొడ్డున ఉన్న గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వరద గుప్పెట్లో చిక్కుకున్నాయి. దీంతో కొల్లేరు వాసులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుజీవుడా అంటూ సాయంకోసం ఎదురుచూస్తున్నారు. వరద నీరు రహదారులపై మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తున ప్రవహిస్తోంది. ఐదో కాంటూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ మునిగిపోయాయి. రాకపోకలు నిలిచిపోయాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏలూరు-కైకలూరు రహదారిలో పెదఎడ్లగాడి వంతెన, ఏలూరు మండలం మాధవాపురం, భీమడోలు మండలం ఆగడాలలంక, కైకలూరు వద్ద పోలీసులు బారికేడ్లను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మిత్రో!, ఉలకవూ, పలకవూ, ఏమి?

భారత రాజకీయాల్లో ప్రేమ, గౌరవం కరువు

అమెరికాలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు

వాషింగ్టన్: భారత రాజకీయాల్లో ప్రేమ, గౌరవం, వినయం వంటివి కనిపించడం లేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన... టెక్సాస్‌లోని భారత-అమెరికన్ కమ్యూనిటీతో ముచ్చటించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు. 'భారత్ అంటే ఒకే భావజాలం అని ఆర్‌ఎస్‌ఎస్ నమ్ముతుంది. కానీ,

- మిగతా 2 లో

ఆ బోట్లు వైసీపీ నేతలవే

సీఎంకు అధికారుల నివేదిక... ఇద్దరి అరెస్టు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొట్టిన సంఘటనలో కుట్రకోణం దాగి ఉందని సీఎం చంద్రబాబుకు అధికారికంగా నివేదిక అందజేయడం చర్చనీయాంశంగా మారింది. బోట్లు గేట్లకు ఉండే కౌంటర్ వెయిట్‌లకు కాకుండా... బ్యారేజీ ఫిల్లర్లను బలంగా ఢీకొడితే ప్రమాద తీవ్రత మరింత పెరిగేదని నివేదికలో వెల్లడించారు. ఈ సంఘటనలో ఉషాద్రితోపాటు సూరాయిపాలేనికి చెందిన కోమటిరెడ్డి రామ్మోహన్‌ను పోలీసులు అరెస్టు చేసి... విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. వారిద్దరూ వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్

- మిగతా 2 లో

హర్యానాలో కుదరని సయోధ్య

కాంగ్రెస్-ఆప్ మధ్య తేలని పొత్తు చర్చలు

20 మంది అభ్యర్థులతో ఆప్ తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)-కాంగ్రెస్ మధ్య పొత్తు విషయంలో పురోగతి లేకపోవడంతో ఆప్ సోమవారం 20మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. 20మంది అభ్యర్థులతో తొలి జాబితాను సొంతంగా ఆప్ విడుదల చేసింది. 11 స్థానాల్లో కాంగ్రెస్‌కు పోటీగా అభ్యర్థులను

- మిగతా 2 లో

విశాలాంధ్ర

మంగళవారం 10, సెప్టెంబరు 2024

పోటెత్తిన వరద

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇప్పటికే వారం రోజులుగా వరద ముంపులో ప్రజలు తీవ్రఇబ్బంది పడుతుండగా... శనివారం నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో దిక్కుతోచని స్థితికి వెళ్లారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి, నాగావళి, వంశధార, రైవాడా, తాండవ, తాటిపూడి, మేఘాద్రి గెడ్డ, గంభీరం, పెద్ద గెడ్డ, తోటపల్లి వంటి జలాశయాల్లో ప్రమాదకర స్థాయికి వరద నీరు చేరడంతో తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. సోమవారం ముందస్తుగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉదయం 8.30 వరకు గడచిన 24గంటల్లో అల్లూరి జిల్లా చింతపల్లిలో 13 సెంటీమీటర్లు, శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో 11 సెంటీమీటర్లు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ, బొండపల్లి, విశాఖ జిల్లా భీమిలిల్లో 10 సెంటీ మీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. మేఘాద్రి గెడ్డ గరిష్ట నీటిమట్టం 61 అడుగులు కాగా, ప్రస్తుతం దిగువ నీటిమట్టం 57.8 అడుగులు కు చేరింది. 58 అడుగులకు నీటిమట్టం చేరుకోగానే గేట్ల ఎత్తివేతకు అధికారులు సిద్ధం అయ్యారు. ఇప్పటికే జీవీఎంసీ 89 వ వార్డు కొత్తపాలెం, ఎల్లపు వానిపాలెం ఎస్సీ కాలనీ, భగత్ సింగ్ నగర్ తదితర ప్రాంతాలలో ప్రజలను జీవీఎంసీ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. అనకాపల్లి జిల్లాలో వరద పరిస్థితిని హెూం మంత్రి అనిత పర్యవేక్షించారు.

భారీ వర్షాలకు 'అల్లూరి' అతలాకుతలం

అల్పపీడనం ప్రవాహంతో గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు గాను అల్లూరి సీతారామరాజు జిల్లా అతలాకుతమైంది. ఆదివారం రాత్రి జీకే వీధి మండలం లోని సప్పర్ల పంచాయతీ చట్రపల్లి గ్రామం పై కొండ చర్యలు విరిగిపడడంతో ఓ20 ఏళ్ల యువతి మృతి చెందింది. కొర్ర పండన్న (60), కొర్ర సుమిత్ర (18), కొర్ర సుబ్బారావు (25) అనే ముగ్గురు గాయపడ్డారు. ఆ గ్రామంలో చాలా ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ప్రస్తుతం గ్రామానికి చేరుకోవడానికి ఎటువంటి రవాణా సౌకర్యం కూడా లేకుండా పోయింది. ఆ గ్రామంలో ప్రస్తుతం 30 కుటుంబాలకి చెందిన 200 జనాభా నివసిస్తున్నారు. జిల్లాలో వాగులు వంకలు, చిన్నపాటి కాలువలు పొంగిపొర్లుతుండగా... కొన్నిచోట్ల బ్రిడ్జిలు కూలిపోయాయి. రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు

పూరీ: వాయవ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ప్రస్తుతం పూరీకి వాయవ్య దిశగా పయనిస్తోందని, దీని ప్రభావం సోమవారం రాత్రి 7.30 వరకు కొనసాగుతుందని తెలిపింది. చత్తీస్‌గఢ్ దిశగా పయనించి క్రమంగా బలహీనపడుతుందని ఐఎండీ పేర్కొంది. తీవ్ర వాయుగుండం ప్రభావం వల్ల ఒడిశాలోని వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మాల్కాన్‌గిరిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా భువనేశ్వర్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రిలీఫ్ కమిషనర్ డి.ఆర్.సింగ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వరదలు వచ్చే అవకాశం లేదని చెప్పారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఏపీ, తెలంగాణలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. మంగళవారం తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో 30కి.మీ నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, భారీ వర్షాలు కురవవచ్చని కూడా హైదరాబాద్ వాతావరణ కేంద్ర సంచాలకులు పేర్కొన్నారు.

కోలుకునేదెలా

(మొదటిపేజీ తరువాయి)

సామాగ్రి నాశనమైంది. దుస్తుల నుంచి గృహోపకరణాలు నీట మునిగిపోయాయి. వంట సామాన్లు, గ్యాస్ స్టౌవ్‌లు నీటితో నిండిపోయాయి. పిల్లల పుస్తకాలు, సర్టిఫికెట్లు వరద నీటిపాలయ్యాయి. దీనికితోడు ద్విచక్ర వాహనాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. లేదంటే బురదలో కూరుకుపోయాయి. అవి ఎక్కడున్నాయో వెతుక్కోవాల్సిన పరిస్థితి. కన్పించకుండా ప్రతి మధ్య తరగతి వర్గాలకు చెందిన ఒక్కో ఇంటికి కనీసం లక్ష రూపాయల నుంచి రూ.2లక్షల వరకు ఆర్థికంగా నష్టం చేకూరే అవకాశముంది. అధికారుల అంచనాలో నీట మునిగిన ఇళ్లకు నష్టం ఎంత జరిగిందనేది ఎలా తేలుస్తారనేది అంతుచిక్కడం లేదు.

ఆటో కార్మికులకు కోలుకోలేని దెబ్బ

ఆటో కార్మికులపై వరద ప్రభావం తీవ్రంగా ఉంది. విజయవాడ నగరంలో 6వేల ఆటోలు నడుస్తున్నాయి. అధిక శాతం సింగ్‌నగర్, వాంబేకాలనీ, కండ్రిక పరిసర ప్రాంతాలకు చెందిన డ్రైవర్లున్నారు. వరదలతో ఇళ్లు, రోడ్లు దగ్గర నిలిపిన ఆటోలు రోజుల తరబడి నీట మునిగాయి. వరద ఉధృతితో చాలా ఆటోలు కిలోమీటర్ల కొద్దీ కొట్టుకుపోయాయి. పది రోజుల నుంచి ఆటో కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. అరకొర ఆహారంతోనే వారు జీవిస్తున్నారు. ఆటోలను అద్దెకు తీసుకుని నడుపుతున్న డ్రైవర్లు తీవ్రంగా నష్టపోనున్నారు. చాలా ఆటోలు ఇన్సూరెన్స్ సౌకర్యం లేకుండా ఉన్నాయి. వాటి పరిస్థితేమిటనేదీ అర్థం కావడం లేదు. భవన నిర్మాణ యజమానులకూ నష్టం వాటిల్లింది. నిర్మాణంలో ఉన్న భవనాలు పది రోజులపాటు వరద నీటిలోనే ఉండటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. వరదలతో చిన్న పరిశ్రమలు చికితిపోయాయి. వరదలతో యంత్రాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో చిన్న పరిశ్రమలపై చాలా మంది ఆధారపడి జీవిస్తుంటారు. దీనివల్ల యజమానులకు ఆర్థికంగా నష్టం రాగా, కూలీల జీవనోపాధికి గండి పడింది. సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దుకాణాలు, ఫ్యాన్సీ షాపులు నడుపుకునే వారికీ నష్టం వాటిల్లింది. వారి దుకాణాలను వరద నీట ముంచెత్తడంతో... ఎంత విలువైన సరుకు కోల్పోయారో ఏవిధంగా తేలుస్తారనేది తెలియడం లేదు.

ఇంకా ఇళ్లకు తిరిగిరాని బాధితులు...

తొలుత వరద కొంతమేర తగ్గినప్పటికీ... మళ్లీ వర్షాలు రావడంతో ముంపు బారిన పడతామన్న ఆందోళనతో చాలా మంది కాలనీలు ఖాళీచేసి సమీప బంధువులు, మిత్రుల ఇంటికి మకాం మార్చారు. స్థానికంగా ఉన్నవారు ఒకటిరెండు రోజుల్లో తిరిగొచ్చే అవకాశమున్నప్పటికీ, జిల్లాలు దాటి దూర ప్రాంతాలకు వెళ్లిన వారు ఇంటికి రావడం కష్టంగా మారింది. ఇప్పటికే వరదల నష్ట గణన ప్రారంభిస్తామని, అందరూ అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ... రవాణా మార్గం లేక తిరిగి ఇళ్లకు చేరుకోలేక పోతున్నారు. ఇంటి దగ్గర ఉన్న వారే గణనలోకి వచ్చే అవకాశముంది. నష్టం గణన సమయంలో ఇంట్లో ఎవరూ లేనప్పటికీ, తర్వాత నమోదుకు అవకాశం కల్పిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ మూడు రోజుల్లోనూ వారు లేకుంటే ఎలా గణిస్తారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఎన్యూమ రేషన్‌లో తమ గృహం, పేరు రాకపోతే స్థానిక ప్రజాప్రతినిధిని కలవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలో ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ ఎలా తిరుగుతామని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దీంతో నష్ట గణనకు మరింత సమయం పెంచాలని బాధితులు కోరుతున్నారు. ఒక్క ఇంట్లో జరిగిన పూర్తి నష్టాన్ని గణనలో చేర్చి...బాధితులందరికీ నష్ట పరిహారం అందేలా చేయాల్సిన అవసరం ఉంది.

భారత్‌లో మంకీపాక్స్ నిర్ధారణ

(మొదటిపేజీ తరువాయి)

ఉందని తెలిపింది. విదేశాల నుంచి భారత్‌కు వచ్చిన ఓ యువకుడిలో మంకీపాక్స్ లక్షణాలు గుర్తించారు. దీంతో వెంటనే ఐసోలేషన్‌లో ఉంచి నమూనాలు లేబొరేటరీకి పంపించారు. అది మంకీపాక్స్ అని నిర్ధారణ అయింది. అయితే, గతంలో భారత్‌లో వెలుగు చూసిన 30 కేసుల మాదిరిగానే ఈ కేసు ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. డబ్ల్యూహెచ్‌వో ఇటీవల ప్రకటించిన ఆందోళనకర క్లేడ్-1 రకం కాదని స్పష్టం చేసింది.

వియత్నాంలో వరద బీభత్సం

బ్రిడ్జ్ సహా కొట్టుకుపోయిన కార్లు, ట్రక్కులు

హనోయ్: అత్యంత శక్తిమంతమైన యాగి తుపాను ప్రభావంతో వియత్నాం వణికిపోయింది. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మరణించిన వారి సంఖ్య 59కి చేరింది. ఉత్తర వియత్నాంలో అనేక నదులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. వరదల కారణంగా ఓ ఉక్కు వంతెన కూలిపోయిన ఘటనలో అనేక కార్లు, ట్రక్కులు కొట్టుకుపోయాయి. మరో ఘటనలో 20 మంది ప్రయాణికులతో కూడిన బస్సు కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఉత్తర వియత్నాంలోని ఫు తో ప్రావిన్స్‌లో రెడ్ నదిపై నిర్మించిన ఉక్కు వంతెన కూలిపోయింది. ఈ ఘటనలో 10 కార్లు, ట్రక్కులు, రెండు బైక్‌లు నీళ్లలో పడిపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ముగ్గుర్ని బయటకు తీసుకురాగా... మరో 13 మంది గల్లంతయ్యారు. మరో ప్రావిన్సు కావో బాంగ్‌లో వరదలకు కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ జల ప్రవాహంలో 20 మంది ప్రయాణికులతో కూడిన ఓ బస్సు కొట్టుకుపోయింది. సహాయక బృందాలు రంగంలోకి దిగినప్పటికీ... ఘటన ప్రదేశానికి చేరుకోలేక ఆగిపోయాయి. యాగి టైఫూన్ శనివారం వియత్నాం తీరం దాటగా... ఆ సమయంలో అక్కడి ఉత్తర తీర ప్రాంతాలు వణికిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 30 లక్షల మందికి పైగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా. ఈ ప్రాంతాన్ని తాకిన అత్యంత శక్తిమంతమైన టైఫూన్‌లలో 'యాగి'ని ఒకటిగా పేర్కొంటున్నారు.

భారత్‌తో మంచి సంబంధాలు కోరుకుంటున్నాం

బంగ్లాదేశ్ ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్

ఢాకా: భారత్‌తో తమ దేశం సుహృద్భావ సంబంధాలు కోరుకుంటోందని బంగ్లాదేశ్ ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ చెప్పారు. ఇవి సమాన హోదాతో పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ విషయాన్ని బంగ్లా ప్రభుత్వ న్యూస్ ఏజెన్సీ బీఎస్ఎస్ వెల్లడించింది. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఇతర వర్గాలతో మహమ్మద్ యూనస్ భేటీ అయ్యారు. దీనిపై అడిగిన ప్రశ్నకు ఆయన సహాయకుడు మహఫూజ్ ఆలం స్పందిస్తూ 'మేం భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగించాలని భావిస్తు న్నాం. ఇవి కచ్చితంగా సమానత్వం, పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉందని యూనస్ చెప్పారు' అని వెల్లడించారు. పొరుగు దేశాలతో సంబంధాల విషయంలో బంగ్లాదేశ్ పరస్పర గౌరవం ఇస్తుందని పేర్కొన్నారు. సార్క్(సౌత్ ఏషియన్ అసోసియేషన్ రీజనల్ కోఆపరేషన్)ను పునరుద్ధరిం చాలని యూనస్ నొక్కి చెప్పినట్లు ఆలం తెలిపారు. భారత్‌లో కూర్చొని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని మహమ్మద్ యూనస్ ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఆమెను అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం కోరే వరకు ఆమె భారత్‌లో మౌనంగా ఉండాలన్నారు. లేకపోతే ఆమె వ్యాఖ్యలు రెండు దేశాల సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మరోవైపు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బంగ్లాదేశ్‌పై చేసిన వ్యాఖ్యలపై ఆ దేశ విదేశాంగశాఖ సలహాదారు ఎండీ తౌహిద్ హుస్సేనీ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. 'ఆ వ్యాఖ్యలను చూసి నేను ఆందోళన చెందడం కంటే... ఆశ్చర్యపోయాను. ఆయన అటువంటి వ్యాఖ్యలు ఎందుకు చేశారో నాకు తెలియదు. వాటి వెనక నాకు బలమైన కారణమేదీ కనిపించలేదు' అని అన్నారు.

'నాటు నాటు' పాటతో హారిస్ ప్రచారం

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికలతో అమెరికాలో రాజకీయాలు వేడెక్కాయి. డెమోక్రాట్లు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. భారత మూలాలున్న అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. దేశీ టచ్‌తో దక్షిణాసియా ఓటర్లను ఆకట్టుకునేందుకు కమలా హారిస్ వినూత్నంగా ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగానే భారత్‌కు ఆస్కార్ అవార్డు తెచ్చిపెట్టిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటతో కమల ప్రచారం చేస్తున్నారు. ఈ పాటను స్ఫూర్తిగా భారత్-అమెరికన్ లీడర్ అజయ్ భుటోరియా 'నాచో నాచో' పేరుతో హిందీ గీతాన్ని విడుదల చేశారు. ఉపాధ్యక్షురాలి ప్రచార కార్యక్రమాల చిత్రాల సమాహారంతో ఈ పాటను ప్రత్యేకంగా రూపొందించి విడుదల చేశారు. ప్రస్తుతం ఈ 'నాచో నాచో' పాట అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అందరినీ ఆకట్టుకుంటోంది. 'నాచో నాచో' కేవలం పాట కాదని అజయ్ భుటోరియా తెలిపారు. దీనిని ఓ ఉద్యమంగా అభివర్ణించారు. దక్షిణాసియా అమెరికన్ కమ్యూనిటీతో అనుసంధానం కావడమే తమ ప్రచారం లక్ష్యమని వెల్లడించారు.

హర్యానాలో కుదరని సయోధ్య

(మొదటిపేజీ తరువాయి)

ఖరారు చేసింది. 2వ అభ్యర్థుల జాబితానూ త్వరలో విడుదల చేయనున్నట్లు ఆప్ హర్యానా అధ్యక్షుడు సుశీల్ గుప్తా వెల్లడించారు. సెప్టెంబర్ 12న ఎన్నికల నామినేషన్లకు గడువు ముగియనుండగా... రెండు పార్టీల మధ్య పొత్తు చర్చలు సాగుతున్న నేపథ్యంలో ఆప్ ఈ నిర్ణయం తీసుకుంది. 90 స్థానాలున్న హర్యానా అసెంబ్లీకి అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. ఆప్ ప్రకటించిన స్థానాల్లో నారైన్‌గర్, అసంధ్, సమలా, ఉచన కలాన్, దబ్వాలి, మెహమ్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్, బద్లీ, బేరీ, మహేంద్రగఢ్, బాద్‌షాపూర్ ఉండగా... ఈ స్థానాల నుంచి కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. ఇక కాంగ్రెస్‌తో పొత్తు అంశంపై ఆప్ హర్యానా అధ్యక్షుడు సుశీల్ గుప్తా మాట్లాడుతూ... "మొదటి రోజు నుంచి మొత్తం 90 స్థానాలకు సిద్ధమవుతున్నామని నేను చాలా స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ఎన్నికలకు ఎక్కువ సమయం లేదు. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ సెప్టెంబర్ 12. కాబట్టి నిరీక్షణ ముగిసింది " అన్నారు. హర్యానాలో ఆప్ బలమైన ప్రత్యామ్నాయాన్ని అందించగల స్థితిలో ఉందని, పార్టీ అభ్యర్థుల రెండవ జాబితాను కూడా త్వరలో విడుదల చేస్తామని ఆయన స్పష్టం చేశారు. హర్యానాలో అధికార భారతీయ జనతా పార్టీ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీ లబ్ధి పొందేందుకు ఆప్ అనుమతిం చదన్నారు. ఆప్ ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయం హర్యానాలో కాషాయ పార్టీకి మేలు చేయదా అన్న విలేకరుల ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. హర్యానా ఎన్నికల్లో తమ పార్టీ పూర్తి బలంతో పోరాడుతుందని మరో ఆప్ నేత సంజయ్ సింగ్ అన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు అవకాశాలపై మాట్లాడుతూ, "మాకు తగినంత సమయం లేదు. మిగిలిన స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే పనిలో మేము నిమగ్నమై ఉన్నాం" అని స్పష్టం చేశారు. సాయంత్రంలోగా ఒప్పందం కుదుర్చుకోవడంలో కాంగ్రెస్ విఫలమైతే మొత్తం 90 సీట్లలో ఆప్ తన అభ్యర్థుల పేర్లను విడుదల చేస్తుందని అంతకుముందు గుప్తా ప్రకటించారు. ఆప్ ప్రకటించిన అభ్యర్థుల జాబితా ప్రకారం... హర్యానా రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనురాగ్ ధండా... మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూపిందర్ సింగ్ హుడా కంచుకోటగా భావించే... కలయత్ నుండి, భివానీ నుండి ఇందు శర్మ పోటీ చేయనున్నారు. ఇక మెహమ్ నుంచి వికాస్ నెహ్రా, రోహ్‌తక్ నుంచి బిజేందర్ హుడా ఎన్నికల బరిలో నిలిచారు. హర్యానాలో ఆప్-కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటు కుదరకపోవడంతో వచ్చే ఏడాది ప్రారంభంలో దిల్లీ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య పొత్తు ప్రశ్నార్థకంగా మారింది. చౌతాలా వంశానికి కంచుకోట అయిన దబ్వాలి నుంచి కుల్దీప్ గద్రానాను ఆప్ పోటీకి దింపింది. 2019 హర్యానా ఎన్నికల్లో ఆప్ 46 స్థానాల్లో పోటీ చేసినా ఒక్క స్థానంలోనూ విజయం సాధించలేకపోయింది. బీజేపీని హర్యానాలో రెండోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని తొలుత ఆప్, కాంగ్రెస్ సూత్రప్రాయంగా అంగీకరించాయి.

విధుల్లో చేరాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తుపై కొత్తగా మరో నివేదిక ఇవ్వాలని సీబీఐని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. వచ్చే మంగళవారం (సెప్టెంబరు 17)లోగా దానిని సమర్పించాలని గడువు నిర్దేశించింది. పశ్చిమ బెంగాల్ ఆరోగ్యశాఖ కోర్టుకు నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో వైద్యుల నిరసనలతో ఇప్పటివరకు 23 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. వైద్యుల భద్రత కోసం నిధులు మంజూరు చేశామని... వీటిని జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని వివరించింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు వైద్యులు విధులకు హాజరుకావాలన్న ధర్మాసనం... వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ వైద్యులు విధుల్లోకి రాకపోతే.. వారిపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని చెప్పింది. నిరంతరం విధులకు దూరంగా ఉంటే భవిష్యత్తులో చర్యలు తప్పవని విశ్వాసాన్ని కలిగించేందుకు ఈ ఆదేశాలు ఇస్తున్నామని తెలిపింది. కాగా బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు. విధుల్లో చేరిన వైద్యులపై ఎటువంటి చర్యలు ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు. ఘటన జరిగిన రోజున మధ్యాహ్నం 1.47 గంటలకు డెత్ సర్టిఫికేట్ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆ తర్వాత 2.55 గంటలకు అసహజ మరణంగా కేసు నమోదైనట్టు పేర్కొన్నారు. అయితే ఆ అసహజ మరణం నివేదికపై స్పష్టత రావాలని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. అలాగే అప్పుడు రికార్డయిన సీసీటీవీ ఫుటేజ్ సీబీఐకి ఇచ్చారా.? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'తమ భద్రత గురించి వైద్యుల మనసులోని ఉన్న ఆందోళనలను తొలగించడానికి విధానాలు రూపొందించాలి.. తగిన చర్యలు తీసుకోవాలి... వైద్యులందరి (ప్రత్యేక డ్యూటీ రూమ్‌లుబీ టాయిలెట్ సౌకర్యాలు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు సహా) భద్రతను నిర్ధారించడానికి అవసరమైన పరిస్థితులు నెలకొల్పినట్టు పోలీసులు నిర్ధారించాలి.' అని సీజేఐ ఆదేశించారు. అనంతరం కేసు విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది.

మరోవైపు, దర్యాప్తుపై కొత్తగా మరో నివేదిక సెప్టెంబరు 17లోగా సమర్పించాలని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... ఫోరెన్సిక్ నివేదిక కోసం నమూనాలను దిల్లీ ఎయిమ్స్‌కు పంపాలని భావిస్తున్నట్టు తెలిపారు . ఎయిమ్స్ వైద్య నిపుణులతో విశ్లేషణ చేయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీంతో వచ్చే మంగళవారం వరకు గడువు ఇచ్చిన న్యాయస్థానం.. ఆ రోజుకి కొత్త నివేదికను అందించాలని సూచించింది.

బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదు: కేంద్రం

సుప్రీం ఆదేశాలతో ఆర్జీ కర్ ఆసుపత్రి వద్ద రక్షణ కల్పిస్తోన్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)కు బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. కనీస సదుపాయాలు లేక మహిళా సిబ్బంది ఇబ్బందిపడుతున్నారని తెలిపింది. దీనిపై స్పందించిన ధర్మాసనం... "బెంగాల్ ప్రభుత్వం, సీఐఎస్ఎఫ్ వెంటనే ఆ సమస్యను పరిష్కరించుకోవాలి. ఈ రోజు రాత్రిలోగా వారికి అన్ని సదుపాయాలు కల్పించాలి" అని ఆదేశించింది. కాగా అన్ని సోషల్ మీడియా వేదికల నుంచి మృతురాలికి సంబంధించిన దృశ్యాలను తక్షణమే తొలగించాలని కోర్టు ఆదేశించింది.

భారత రాజకీయాల్లో ప్రేమ, గౌరవం కరువు

(మొదటిపేజీ తరువాయి)

భారత్ అంటే భిన్న భావజాలం అని మేం విశ్వసిస్తున్నాం. అమెరికాలో మాదిరిగానే అందరికీ ప్రాతినిధ్యం ఉండాలని మేం కోరుకుంటాం. కులం, మతం, భాష, సంప్రదాయాలతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ కలలు కనేందుకు అర్హులే. కానీ, భారత్‌లో ఇప్పుడు ఆ పరిస్థితుల కోసం పోరాడాల్సి వస్తోంది. భారత ప్రధాని (మోదీ) రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని మొన్నటి ఎన్నికలతో ప్రజలందరికీ అర్థమైంది' అని రాహుల్ విమర్శించారు. 'మా రాజకీయ వ్యవస్థలో ప్రేమ, గౌరవం, వినయం వంటివి లేవు. రాజకీయ నాయకులు కులమతాలు, భాషలు, రాష్ట్రాలకు అతీతంగా అందరినీ ప్రేమించాలి. కేవలం శక్తిమంతులనే గాక... భారత్‌ను నిర్మించేందుకు ప్రయత్నించే అందరినీ గౌరవించాలి. వీటన్నింటినీ రాజకీయాల్లో తిరిగి తీసుకొచ్చేందుకే నేను నిరంతరం పనిచేస్తున్నా' అని రాహుల్ గాంధీ వెల్లడించారు. అదే సమయంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజార్టీ దాటలేకపోయిన అంశాన్ని రాహుల్ పరోక్షంగా ప్రస్తావించారు. 'మన సంప్రదాయాలు, భాషలపై బీజేపీ దాడి చేస్తోందని నాతో చాలామంది చెప్పారు. ఆ పార్టీ ఎలాంటిదో వారు అర్థం చేసుకున్నారు. బీజేపీ, ప్రధాని అంటే ఇప్పుడు ఎవరూ భయపడట్లేదని ఎన్నికల ఫలితాలతోనే స్పష్టమైంది. రాజ్యాంగంపై దాడిని తాము ఎన్నటికీ అంగీకరించబోమని ప్రజలు స్పష్టంగా చెప్పారు' అని రాహుల్ అన్నారు. భారత్ జోడో యాత్ర తనను ఎంతగానో మార్చిందని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు. 'ఆ యాత్ర తర్వాత నా ఆలోచనా విధానం కొత్తకోణంలోకి మారిపో యింది. ప్రజలతో కొత్త బంధాన్ని ఏర్పరిచింది. ఆ యాత్రతో భారత రాజకీయాల్లో ప్రేమ అనే కొత్త అధ్యా యాన్ని తీసుకొచ్చాం' అని రాహుల్ తెలిపారు.

తెలుగుభాష గురించి రాహుల్

అంతకుముందు డల్లాస్‌లోని ప్రవాస భారతీయులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. మన దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, భాషలు, సంప్రదాయాల పేరుతో ఎవరినీ వేరు చేసి చూడొద్దని అన్నారు. అదే సమయంలో తెలుగు భాష గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'భారత జాతీయగీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది. సమానంగా చూపిస్తుంది. అంతేగానీ.. ఒక రాష్టం మొదటిది... మరో రాష్ట్రం రెండోదని ఎక్కడా ఉండదు. ఈ గీతం మన దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా చెబుతుంది. అప్పుడు ఒక రాష్ట్రం కంటే ఇంకో రాష్ట్రం ఎక్కువా కాదు... తక్కువా కాదు. అలాగే భాష, సంప్రదా యాలు కూడా. తమిళం మాట్లాడేవారు మాకు నచ్చరు అని... హిందీ మాట్లాడే వారే ఇష్టమని మనం చెప్పడం సరికాదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 'తెలుగునే తీసుకోండి. మనం తెలుగు అని చెబుతున్నప్పుడు అది కేవలం భాష కాదు. ఒక చరిత్ర, ఒక సంప్ర దాయం, సంస్కృతి. హిందీతో పోలిస్తే తెలుగు భాష అంత ముఖ్యం కాదని ఒకవేళ ఆ రాష్ట్ర ప్రజలకు మీరు చెప్పినట్లయితే... వారిని మీరు అవమా నించినట్లే. అలా పోలుస్తూ... తెలుగు చరిత్ర, అక్కడి సంప్రదాయం, సంస్కృతి, పూర్వీకులు ముఖ్యం కాదని మీరు చెప్పినట్లే' అని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. ఈ చిన్న తేడాను కొందరు అర్థం చేసుకోకపోవడం వల్లే భారత్‌లో దీనికోసం పోరాటం జరుగుతోందని బీజేపీపై రాహుల్ విమర్శలు గుప్పించారు.

ఆ బోట్లు వైసీపీ నేతలవే

(మొదటిపేజీ తరువాయి)

అనుచరులుగా గుర్తించారు. ఈనెల 1వ తేదీన వరదలకు ప్రకాశం బ్యారేజీకి రికార్డుస్థాయిలో 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో బ్యారేజీకి ఎగువున గొల్లపూడి నుంచి ఐదు ఇనుప బోట్లు కొట్టుకొచ్చాయి. అందులో మూడు బోట్లు బ్యారేజీ గేట్ల వెనుక ఉండే కౌంటర్ వెయిట్లను బలంగా ఢీ కొట్టాయి. అవి ప్రస్తుతం బ్యారేజీ 67, 69వ ఖానాల వద్ద చిక్కుకున్నాయి. కౌంటర్ వెయిట్లకు జరిగిన నష్టంపై కృష్ణారివర్ కన్జర్వేషన్ ఈఈ పీవీఆర్ కృష్ణారావు విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ ఘటనపై ఐదు కేసులు నమోదు చేశారు. బ్యారేజీకి దూసుకొచ్చిన బోట్లలో... మూడు బోట్లు ఉషాద్రి అనే వ్యక్తికి చెందినవిగా పోలీసులు గుర్తించారు. ఉషాద్రికి వైసీపీ నేత కోమటిరెడ్డి రామ్మోహన్‌తో సంబంధాలు ఉన్నట్లు అనుమాని స్తున్నారు. దీంతో ఉషాద్రిని, వైసీపీ నేత రామ్మోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐదు బోట్లలో మూడింటిపై వైసీపీ రంగులేసి... ఒకదానికొకటి ఇనుప గొలుసులతో అనుసంధానించారు. సాధారణంగా బోట్లను ఇలా ఒకదానికొకటి కట్టడం అనుమానాలకు తావిస్తోంది. ఇలా ఒకదానికొకటి కట్టేసిన మూడు బోట్లను ఒక ప్లాస్టిక్ తాడుతో గొల్లపూడి స్మశానం వద్ద ఉన్న ఒక చెట్టుకు కట్టారు. ఒక్కో బోటు బరువు 40-50 టన్నులు ఉంటుంది. ఆ బోట్లలో మూడింటిని ఇనుప గొలుసులతో కట్టి అసలైన లంగరు మాత్రం ప్లాస్టిక్ తాడుతో వేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ కుట్రలో ఎంతమంది ఉన్నా శిక్షించి తీరతామని మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, తానేటి వనిత వ్యాఖ్యానించారు. పోలీసులు విచారణను వేగవంతం చేశారని, దర్యాప్తులో వాస్తవాలు వెలుగు చూస్తాయని స్పష్టంచేశారు. కాగా, ఈ బోట్లు కొట్టుకొచ్చిన సంఘటనలో అరెస్టులను వైసీపీ ఖండించింది. బోట్ల కేసు నిందితుడు నారా లోకేశ్‌కు సన్నిహితుడని తెలిపింది. ఈ కేసులో అదుపులోకి తీసుకున్న రామ్మోహన్ స్వయానా టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు కోమటి జయరామ్‌కు బంధువు అని పేర్కొంది.

కొల్లేరు కకావికలం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. ప్రయాణికులు వెళ్లకుండా పోలీసులు పహార కాస్తున్నారు. మండవల్లి మండలం పెనుమాక లంక, నందిగం ,ఇంగిలి పాక, రుద్రపాక, ఉనికిలి, పిల్లిపాడు, కోటకొండ, కొవ్వాడలంక, చింతపాడు, నుచ్చుమిల్లి, మణుగులూరు, పెద్ద లంక, ఉనికిలి, ఏలూరు మండలం మాధవపురం, కోటేశ్వర దుర్గాపురం, మానూరు, మొండికోడు, కోమటిలంక , కలకుర్రు, పెదయాగానిమిల్లి, గుడివాక లంక, కొక్కిరాయి లంక, పత్తి కోళ్ల లంక, పైడి చింతపాడు, భీమడోలు మండలం ఆగడాల లంక, పెదపాడు మండలంలో కొనికి, గోగుంట, వసంతవాడ, కడిమికుంట, సత్యవోలు, గుడిపాడు, వడ్డిగూడెం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామాలను చేరుకునేందుకు మర బోట్లు, దోనెలను వినియోగిస్తున్నారు. మాధవపురం వద్ద కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పూర్తిగా నీటిలో మునిగింది. ఓపక్క వరద నీరు, మరో పక్క ఎడతెరిపి లేని వర్షాలు కొల్లేరు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇళ్లలో వరద నీరు చేరింది. చేపల పడవలు, తాటి దోనెలు, చేపల తట్టలు రోడ్లపైకి కొట్టుకువస్తున్నాయి. మూగజీవాలు రోడ్లపైకి వస్తున్నాయి. ముంపు బారిన పడిన ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు.

మంచమెక్కిన మన్యం

ఏలూరు జిల్లా మారుమూల ఏజెన్సీ మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో వరదలు రైతాంగాన్ని నట్టేట ముంచాయి. పారిశుద్ధ్యం లోపించడంతో మన్యం వ్యాధులతో మంచంక్కెంది. నెలరోజులపైగా జోరుగా పడుతున్న భారీ వర్షాలకు చెరువులు,వాగులు నిండు కుండను తలపిస్తున్నాయి. పొంగి ప్రవహిస్తున్నాయి. కుక్కునూరు - దాచవరం గ్రామాల మధ్య గుండేటి వాగు అప్రోచ్ రోడ్డు గోదావరి వరదకు నెల రోజుల క్రితం కోతకు గురై కొట్టుకుపోయింది. వంతెన బీటలు బారి ధ్వంసమైంది. 10 గ్రామాలకు కుక్కునూరు తో సంబంధాలు తెగిపోయాయి. వేలేరుపాడు ఎద్దువాగుకు వరద ఉధృతి పెరిగింది. ఈ ఏడాది సాగు ప్రశ్నార్థకంగా మారింది. గతంతో పోల్చుకుంటే పత్తి, మిర్చి ఇతర పంటల సాగు తగ్గినట్టు రైతులు చెబుతున్నారు.మార్కెట్‌లో జామాయిల్ కి గిరాకీ ఉండటంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని రైతులు అధికంగా ఆ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వ్యాప్తి చెందాయి. అపరిశుభ్రత, కలుషిత నీరు వలన వ్యాధులు ప్రబలాయి. అధికశాతం వైరల్ జ్వరాల బారిన పడ్డారు. వైద్య ఆరోగ్యశాఖ వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరాలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాహన దారులు పడరాని పాట్లు పడుతున్నారు. ద్విచక్ర తరుచూ మరమ్మత్తులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు నానాయాతన పడుతున్నారు.

'ఏలేరు' నీటిమట్టం 85.60 సెంటీమీటర్లు

ఏలేరు జలాశయంలోకి భారీఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. పూర్తి సామర్థ్యం 86.56 సెంటీమీటర్లు కాగా సోమవారం ఉదయం ఆరు గంటల సమాయానికి 85.60 సెంటీ మీటర్లకు నీటి మట్టం చేరుకుంది. కాలువ గట్టులు పటిష్టంగా లేకపోవడంతో గండ్లు పడి ముంపు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఉదయం 21,603 క్యూసెక్కులుండగా సాయంత్రం నాలుగు గంటలకు 45,755 క్యూసెక్కులకు చేరుకుందని ఏఈ పట్టాభిరామయ్య చౌదరి వెల్లడించారు. 21,775 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కలెక్టర్ షాన్మోహన్ సగిలి పర్యవేక్షిస్తున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొన్నట్లు తెలుస్తుంది. ఏలేశ్వరం- అప్పన్నపాలెం వంతెనపై రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి.

మేము సైతం... కదలిన దాతలు

సీఎం చంద్రబాబుకు పెద్ద ఎత్తున విరాళాల అందజేత



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వరద బాధితు లను ఆదుకునేందుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన తెలుగువారు బాధితులను ఆదుకు నేందుకు తమ వంతు చేయూతనిస్తున్నారు. వరద ప్రాంతాల్లో గత 9 రోజులుగా పర్యటిస్తూ సీఎం చంద్రబాబు బాధితులకు భరోసా కల్పిస్తుండగా... ప్రభుత్వ అధికార యంత్రాంగం, వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సహాయక కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు మేము సైతం అండగా ఉంటామంటూ తమకు తోచినంత ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. మరోపక్క బాధితులకు అందే సహాయ చర్యలను నిత్యం పర్యవేక్షిస్తూ 9 రోజులుగా సీఎం విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉంటున్నారు. విరాళాలు అందజేసే దాతలు ముఖ్యమంత్రికే నేరుగా అందజేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరికొందరు మంత్రి నారా లోకేశ్‌కు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎం.ఈ.ఐ.ఎల్. మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ సి.హెచ్.సుబ్బయ్యలు 5 కోట్ల రూపాయల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే మూడురోజుల పాటు వరద బాధితులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, మంచినీరు అందజేస్తున్నట్లు తెలిపారు.

విశాఖపట్నానికి చెందిన జీఎంఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చల్లా ప్రసన్న, సీఈఓ మనోమేరాయ్ రూ.2.5 కోట్లు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి రూ.కోటి, లలితా జ్యుయెలర్స్ అధినేత కిరణ్ కోటి, వెల్‌జాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధినేత వెలమాటి జనార్దనరావు కోటి, మెప్మా తరపున ఐఏఎస్ తేజ్ భరత్ రూ.కోటి చెక్కులు సీఎంకు అందజేశారు. ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్ రూ.50 లక్షలు, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ అధ్వర్యంలో సింగపూర్ ప్రవాస తెలుగువారు రూ.17.50 లక్షలు, సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి డాక్టర్ అమ్మన్న రూ.15 లక్షలు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.10 లక్షలు, ఎన్ఆర్ఐలు సురేశ్ మానుకొండ, ఉప్పు వినోద్ బాబు, వరదా అమర్ రూ.10 లక్షలు అందించారు. ఏపీ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నుండి డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ రూ.6 లక్షలు, బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ యాజమాన్యం సూర్యదేవరబాబు-వెంకట రమా ప్రసాద్ రూ.5 లక్షలు, వల్లూరి రవీంద్రనాథ్, తేజ్, రూ.5 లక్షలు, మండపేట నియోజకవర్గం నుండి రైస్ మిల్లర్స్ తరపున రూ.5 లక్షలు, ఛాంబరాఫ్ కామర్స్ తరపున రూ.1.5 లక్షలు, రోటరీ క్లబ్ తరపున రూ.75 వేలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రూ.5 లక్షలు, బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ సంస్థ రూ.5 లక్షలు, ది అలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున రూ.5 లక్షలు సీఎంకు అందజేశారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రూ.4 లక్షలు, టి.సతీశ్ రూ.3 లక్షలు, పాలడుగు పార్వతిదేవి రూ.3 లక్షలు, ప్రసాద్ నాయుడు రూ.2 లక్షల 116, గాంధీ-వసుమతి రూ.2 లక్షల 16లు, కొత్తపల్లి గాంధీ రూ.లక్ష, కేపీఎస్వీ ప్రసాద్ రూ.లక్ష, యలమంచిలి విమలాబాయ్ రూ.లక్ష, తోటకూర రాజారత్నం బాబు రూ.లక్ష, టి.కిషోర్ కుమార్ రూ.1,11,116 అందించారు. గారపాటి శ్రీలక్ష్మీ రూ.లక్ష, పులి వెంకటేశ్వర్లు రూ.లక్ష, కె. ప్రభాకర్ రావు రూ.75 వేలు, కరణం పద్మజ బంగారపు ఉంగరం, దివ్యాంగుడు వి.బాబూరావు కేఆర్ జడ్పీహైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్ రూ.50 వేలు, కరుసల శైలజా రూ.50 వేలు, ఎ.బాలాజీ ప్రసాద్ రూ.50 వేలు, జీఎన్‌బీవీ ప్రసాద్ రావు రూ.50 వేలు, చలసాని సుబ్బారావు రూ.40 వేలు, చలసాని భార్గవి రూ.32 వేలు, జి.సాంబశివరావు రూ.10 వేలు, ఆర్.రాధాకృష్ణ రూ.10 వేలు అందించారు.

చిట్టి చేతులు... పెద్ద సాయం

విజయవాడలో వరద బాధితులకు పశ్చిమ గోదావరి జిల్లా పడమర విప్పర్రు గ్రామంలోని శ్రీ విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు విరాళం ఇచ్చారు. వారి పాకెట్ మనీని విరాళంగా ఇస్తున్న వీడియోను సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చిట్టిచేతులు పెద్ద సాయం చేశాయంటూ ప్రశంసించారు. ఆ వీడియో తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. విద్యార్థు లకు ఉన్నత విలువలు నేర్పుతున్న స్కూల్ యాజమాన్యాన్ని సీఎం అభినందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఇతరులను గౌరవంగా చూడటం లాంటి లక్షణాలు మానవత్వాన్ని పెంచుతా యని, చిన్నారులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దుతాయని సీఎం అన్నారు.

వరద బాధితుల కోసం మెప్మా రూ.కోటి విరాళం

విశాలాంధ్ర-గుంటూరు: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధ్వర్యంలో విజయవాడ వరద విపత్తుల నిధికి రాష్ట్ర స్వయం సహాయక సంఘాలు విరాళంగా ఇచ్చిన కోటి రూపాయల చెక్కును మెప్మా ఎండీ ఎన్.తేజ్ భరత్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సోమవారం అందజేశారు. మెప్మా రాష్ట్ర ప్రధాన కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ, ఏఐఎస్ఎఫ్ బియ్యం పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముంపు బాధితులకు సీపీఐ, ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. సోమవారం విజయవాడ నగరంలోని 58వ డివిజన్, వడ్డెరకాలనీ ప్రజలకు 300 కిలోల బియ్యాన్ని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి కేవీ భాస్కరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ, సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణ్, కోశాధికారి సాయికుమార్, నాయకులు యశ్వంత్, కార్తీక్, దుర్గా సాయి, అమర్నాథ్, డేవిడ్, కిరణ్, రంజిత్, సుధీర్ పాల్గొన్నారు. వరద బాధితుల కోసం బియ్యం సేకరించిన ఏఐఎస్ఎఫ్ నాయకత్వాన్ని జి.కోటేశ్వరరావు అభినందించారు.

బ్యారేజీ గేట్ల మరమ్మతులు పూర్తి

కన్నయ్యనాయుడుకు సన్మానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న గేట్ల మరమ్మతు పనులు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బ్యారేజీలోకి బోట్లు దూసుకురావడంతో 67, 69, 70 గేట్ల వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లకు జలవనరులశాఖ సలహాదారు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో పనులు చేపట్టారు. దెబ్బతిన్న వాటి స్థానంలో స్టీల్‌తో తయారు చేసిన భారీ కౌంటర్ వెయిట్లను ఇంజినీర్లు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల్లోపే మూడు గేట్ల వద్ద భారీ కౌంటర్ వెయిట్లు వేగవంతంగా పూర్తిచేశారు. బెకెమ్ ఇన్‌ఫ్రా సంస్థ గేట్ల మరమ్మతులు చేపట్టి పూర్తి చేసింది. రేయింబవళ్లు పనిచేసిన సిబ్బంది, ఇంజినీర్లు, అధికారులను కన్నయ్య సన్మానించారు. గేట్ల పనుల్లో తమకు సూచనలిచ్చిన కన్నయ్యనూ ఇంజినీర్లు తిరిగి సన్మానించారు.

సీఎం ప్రోత్సాహంతో వేగంగా పూర్తి: కన్నయ్య

అనంతరం కన్నయ్య విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సహకారం, ప్రోత్సాహంతోనే పనులు వేగంగా పూర్తి చేశామన్నారు. గేట్ల మరమ్మతు పనులు శరవేగంగా చేశామని, ప్రస్తుతం ఆ మూడు గేట్లూ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. మంగళవారం నుంచి బ్యారేజీలోని బోట్ల తొలగింపు పనులు చేపడతామన్నారు. రైతులకు నష్టం జరగకూడదనే రేయింబవళ్లు కష్టపడి పనిచేసి పూర్తి చేశామని తెలిపారు. తుంగభద్ర, ప్రకాశం బ్యారేజీ గేట్లకు మరమ్మతులు చేసి పంట పొలాలు రక్షించడం సంతోషం కలిగించిందన్నారు. తనకు సహకరించిన అధికారులు, ఇంజినీర్లకు కన్నయ్య ధన్యవాదాలు తెలిపారు.

ఇంకెంతకాలం ఈ కష్టాలు

నిండు గర్భిణిని ఆసుపత్రికి తరలించేందుకు అవస్థలు

విశాలాంధ్ర- జీకే విధి(అల్లూరి జిల్లా): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని ఆసుపత్రికి తరలించేందుకు గిరిజనులు పెద్ద సాహసమే చేశారు. వాగు దాటేందుకు ఒకే ఒక అవకాశంగా ఉన్న పురాతన కాలంనాటి చిన్న వంతెన ఆధారంగా తాడు కట్టి అవతలి ఒడ్డుకు తీసుకువెళ్లారు. వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం మొండిగడ్డ గ్రామానికి చెందిన కందుల శాంతికి నెలలు నిండాయి. సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు ఆమెను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు ప్రయాణమ య్యారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అవతలికి వెళ్లేందుకు జెర్రెల వంతెన దాటాల్సి ఉంది. కాలువ ఉధృతంగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్నది. వంతెనపైకి కొన్ని అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఓవైపు గర్భిణీకి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఆమెను చింతపల్లి ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు సాహసం చేశారు. ఇటువైపు జీపు, అటువైపు అంబులెన్స్... మధ్యలో ఒక తాడు కట్టి దాని సహాయంతో ఆమెను అతికష్టం మీద చింతపల్లి ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఏమాత్రం పట్టుతప్పినా వాగులో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దీనికితోడు వంతెన కూడా పురాతనమైనది కావడంతో అది కూలిపోయే అవకాశం ఉంది. అయినప్పటికీ గ్రామస్తులు సాహసం చేసి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి జర్రెల వంతెనను ఆధునీకరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బుడమేరు ఆక్రమణలు తొలగించండి

రైతులకు న్యాయం: కౌలురైతు, సీపీఐ నేతల డిమాండ్

విశాలాంధ్ర-గుడివాడ: కృష్ణాజిల్లా నందివాడ మండలం చిన్నలింగాల, పెద్ద లింగాల, పుట్టగుంట, చేదుర్తిపాడు, ఒడ్డులు మెరక, రామపురం, కుదరవల్లి, ఇలపర్రు తదితర లోతట్టు ప్రాంతాలను సోమవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, సీపీఐ నేతలు... రైతులతో కలిసి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జయలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య మాట్లాడుతూ ప్రకృతి విపత్తు నష్టాన్ని అంచనావేసి రైతులకు న్యాయపరంగా పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టం అంచనా సమయంలో రైతులు. కౌలు రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. బుడమేరులో అక్రమణలు తొలగించి ముంపు నుంచి ప్రజలను రక్షించాలన్నారు. ఎనికేపాడు, సురంపల్లి, మంతేన, తెన్నేరు, ఉంగుటూరు, పుట్టగుంట వంతెనలను ఎత్తు పెంచి రైతులను కాపాడాలన్నారు. ప్రతిఏటా గుర్రపు డెక్క, తూటుకూడ తొలగించాల న్నారు. రైతు రుణాలను రద్దు చేసి, బీమా వర్తింప చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందజేయాలన్నారు. జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. రైతులు, కౌలు రైతులకు రూ.50 వేలు సాయం అందించాలన్నారు. సీపీఐ గుడివాడ నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాశ్ బాబు, ఏఐటీయూసీ నాయకులు చింతలూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు నందిగం సురేశ్‌కు జగన్ పరామర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్రమ కేసులో అరెస్టయిన మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. 11వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు ఆయన గుంటూరు జైలుకు వెళ్లి నందిగం సురేశ్‌ను కలుసుకుంటారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఇటీవల నందిగం సురేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసులో సురేశ్‌తోపాటు, మరికొందరు వైసీపీ నాయకుల్ని కూటమి ప్రభుత్వం ముద్దాయిలుగా చేసింది.

వరద బాధితుల బాధ్యత కేంద్రానిదే

నీటిపారుదల రంగ నిపుణుడు లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వరద బాధితులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఆదుకోవాలని నీటి పారుదల రంగ నిపుణుడు టి.లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్వర్యంలో స్థానిక రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక హాలులో 'బుడమేరు నేర్పిన గుణపాఠాలు'పై చర్చా గోష్ఠి కార్యక్రమం వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బుడమేరు వరదలు గతంలో ఎన్నడూ లేనివిధంగా అపారనష్టం కలిగించాయన్నారు. ఇలాంటి ఉపద్రవం భవిష్యత్తులో జరగకుండా బుడమేరు సహజ ప్రవాహ మార్గాన్ని కొల్లేరు సరస్సు వరకు తీసుకెళ్లాలని, ఆక్రమణలు, కబ్జాలను తొలగించాలని డిమాండ్ చేశారు. బుడమేరు డైవర్షన్ ఛానల్(బీడీసీ) ద్వారా కృష్ణానదికి 37,500 క్యూసెక్‌ల ప్రతిపాదిత సామర్థ్యాన్ని యుద్ధ ప్రతిపాదికన అమలులోకి తీసుకురావాలని కోరారు. 8 రోజులుగా ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, సినీ, వ్యాపార ప్రముఖులు ప్రదర్శిస్తున్న దాతృత్వాన్ని, మానవత్వాన్ని మరువలేమన్నారు. బుడమేరును గత పాలకులు విస్మరించారని ఆవేదన వ్యక్తంచేశారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద 11 లాకులు ఉంటే నాలుగు పని చేయడం లేదని, సరైన సిబ్బంది లేరన్నారు. పులిచింతల దిగువ భాగంలో వైకుంఠపురం వద్ద 20 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తే మున్నేరు వరద నీటిని నిల్వ చేసుకోగలమన్నారు. వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువకు నీరు తరలిస్తే గోదావరి, కృష్ణా, పెన్నానదుల అనుసంధానానికి తోడ్పడుతుందని తెలిపారు.

మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ వెలకట్టలేనిదన్నారు. వైసీపీ పాలనలో నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, బడ్జెట్‌లో అతి స్వల్ప కేటాయింపులు జరిగాయని దుయ్యబట్టారు. వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న హైడ్రా లాంటి సంస్థను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసి నాలాలు, వాగులు, సరస్సులు, నదుల ఆక్రమణలను, కబ్జాలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని, వైసీపీ ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 8న 198 సాగునీటి పనులు ఒక్క కలం పోటుతో రద్దు చేసిందని, బుడమేరు ఆధునీకరణను కొనసాగించలేదన్నారు. ప్యారిస్, లండన్, న్యూయార్క్ లాంటి నగరాల మధ్య నుంచి నదులు ప్రవహిస్తున్నా... వాటిని ఆయా నగరాలు సక్రమంగా వినియోగించుకుంటున్నాయని తెలిపారు. లంక గ్రామాల్లో దాదాపు రెండు లక్షల హెక్టార్లలో పంటలు ధ్వంసమయ్యాయని, ఆ రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. రాజకీయ విశ్లేషకుడు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ నేతలు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అవినీతికి పాల్పడుతూ విషవలయంగా మారి నాణ్యతకు, ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చర్చా గోష్ఠిలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు, రైతుసంఘ జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, నేస్తం సహవ్యవస్థాపకుడు టి.ధనుంజయ్ రెడ్డి, న్యాయవాది అవధానుల హరి, పి.పోతురాజు, మానవత కోశాధికారి టీవీ సాయిరాం, ప్రోగ్రెసివ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పి.మల్లికార్జునరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి.శేషుబాబు, ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ సుందర రామయ్య, విద్యావేత్త కన్నారెడ్డి పాల్గొన్నారు.

విపత్తులో రెవెన్యూ కీలకపాత్ర: ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విపత్తుల నిర్వహణ సేవలో రెవెన్యూశాఖ సేవలు కీలకంగా నిలుస్తున్నాయని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ భారీ వర్షాలు, వరదలతో నష్టాల అంచనాలను ప్రభుత్వం నిర్వహించనుందని తెలిపారు. విజయవాడ నగరంలోని 32 వార్డులలో వరద భాదితలకు నష్టపరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొంటారని వివరించారు. పది రోజులుగా రేయింబవళ్లు పనిచేస్తున్న సీఎం చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని నష్టపరిహారం అంచనాల్లో రెవెన్యూ సిబ్బంది భాగస్వాములు కావాలని కోరారు. బాధితులతో రెవెన్యూ సిబ్బంది వాదనలకు దిగవద్దని సూచించారు. వరద బాధితుల పట్ల బాధ్యత, ఓర్పు, సహనంతో వ్యవహరించాలని కోరారు. సర్వం కోల్పోయిన బాధితుల ఆవేదనను ఉద్యోగులు గమనించాలన్నారు. వరద బాధితులు ఇప్పటికే పదిరోజులుగా ఆందోళన చెందుతున్నారని వివరించారు. బాధితులందరితో సమన్వయంగా మెలగాలని బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు కోరారు.

జత్వానీ కేసుపై న్యాయ విచారణ

మహిళా సంఘాల జేఏసీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీ కేసుపై న్యాయ విచారణ చేయాలని మహిళా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. జత్వానీ పట్ల అనుచితంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నటి జత్వానీ మాట్లాడుతూ తనకు న్యాయం చేయాలని కోరితే కొన్ని మీడియా సంస్థలు దాన్ని రాజకీయం చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులైన తన తల్లిదండ్రుల పట్ల అధికారులు దురుసుగా ప్రవర్తించారన్నారు. తనపై అసత్య కథనాలు ప్రచురించిన పత్రికలపై ఇప్పటికే పరువు నష్టం దావా వేశామని చెప్పారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తనకు న్యాయం చేస్తారని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విద్యాసాగర్ వంటి నేరచరిత్ర గల వ్యక్తుల మాటలు విని ఉన్నతాధికారులు విచారణ చేయకుండా తనని వేధించా రన్నారు. ఈ కేసులో నాటి ప్రభుత్వ పెద్దల హస్తం ఉంటుందని సందేహం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల జేఏసీ నాయకు రాలు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా భారత దేశం మొత్తం ఈ కేసు గురించి తెలిసిందన్నారు. జత్వానీ కేసులో పోలీసులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో ప్రజలం దరికీ తెలుసని, ప్రత్యేక విమానంలో ముంబై వెళ్లి అమెను తీసుకొచ్చారంటే ఎంత పలుకు బడి ఉపయోగించారో అర్థమవుతోందన్నారు. పోలీసు విచారణ కన్నా న్యాయ విచారణ చేస్తేనే జత్వానీకి న్యాయం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ ఓ పారిశ్రామికవేత్త ముంబైలో ఆమెను లొంగదీసుకొని అనేక రకాలుగా చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఆ పారిశ్రామికవేత్తకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాయన్నారు. జత్వానీ అరెస్టు వెనక పెద్ద కుట్ర దాగి ఉందని, మోదీ సర్కారు పాత్ర ఉంటేనే ఇంత పెద్దస్థాయిలో జరుగుతుందన్నారు. జత్వానీకి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి చంద్రబాబు రాష్ట్రాన్ని తీసుకొచ్చారని, కానీ ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవటం అనుమానాలు రేకెత్తిస్తోందన్నారు. జత్వానీకి మహిళా సంఘాల జేఏసీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఐద్వా నాయకురాలు రమాదేవి మాట్లాడుతూ ఈ కేసులో పోలీసు ఉన్నతాధికారులు అఘమేఘాలు మీద చర్యలు చేపట్టడం వెనుక పెద్దల హస్తం ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. తక్షణం దోషులను శిక్షించటంతో పాటు బాధితురాలికి న్యాయం జరగాలన్నారు. ఈ కేసుపై బీజేపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలికి బాధ్యత ఉన్నదా లేదా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో అనేకమంది మహిళా నేతలు పాల్గొన్నారు.

మహోన్నతుడు సుంకర సత్యనారాయణ

సీహెచ్ కోటేశ్వరరావు నివాళి

ఇబ్రహీంపట్నం: డాక్టర్ గరికపాటి రాజారావుతో కలిసి స్వయంగా నాటకాలు, నాటికలు ఆడి... బుర్రకథలు చెప్పి ప్రజాచైతన్యం కోసం తపించిన మహోన్నత వ్యక్తి అమరజీవి సుంకర సత్యనారాయణ అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు నివాళి అర్పించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ సుంకర సత్యనారాయణ జీవిత సంఘటనలు కొన్నింటిని వివరించారు. మగ్దూం మొహియుద్దీన్, నార్ల వెంకటేశ్వరరావు, పులుపుల వెంకట శివయ్య, చక్రపాలం, మద్దుకూరి చంద్రశేఖరరావు, వెంకటరత్నం, కోనంకి అప్పలస్వామి, కుటుంబరావు, మహీధర రామ్మోహనరావు, శ్రీశ్రీ, త్రిపురనేని గోపీచంద్ వంటి మహోన్నతుల సహచరుడిగా సత్యనారాయణ ఉన్నారని వివరించారు. వాసిరెడ్డి భాస్కర్‌రావుతో కలిసి సంయుక్తంగా రచించిన మాభూమి నాటకం చరిత్ర పుటలకు ఎక్కిందన్నారు. కష్టజీవి అల్లూరి సీతారామరాజు, వీరేశలింగం ముందడుగు బుర్రకథలు, నమ్మినబంటు, పుట్టినిల్లు, పల్లెటూరు, భూమికోసం వంటి సినిమాలకు కథలు, మాటలు, పాటలు రాసి ఎన్నో అవార్డులు పొందిన రచయిత అని కోటేశ్వరరావు కొనియాడారు. ప్రజాకవిగా, ప్రజా కళాకారుడిగా, చిరంజీవిగా ఆయన నిలిచారన్నారు. కార్యక్రమంలో సుంకర కుమార్, మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, నాయకులు మెకానిక్ రాజు, శేఖర్‌రావు, సుబ్బారావు, రాంబాబు, తిరుపతిరావు, ఎస్.దుర్గమ్మ, నాగమణి పాల్గొన్నారు.

SRIKAR Biotech Pvt. Ltd
Plot No. A11 & A12/1, Road No.1 & 12, IP Nacharam, Medchal- Malkajgiri District, Hyderabad-500076, Telangana State, India

NOTIFICATION

In Pursuance to the Order No-SO 2900(E) dated 24-10-2015, and its amendment dated 30-12-2017 issued by department of Agriculture and Co-operation and Farmers Welfare, Ministry of Agriculture and Farmers Welfare. Govt. of India. **M/s Srikar Biotech Pvt. Ltd.** hereby notifies that it intends to market in the state of ANDRAPRADESH 100% water soluble NPK Mixture fertilizers as per specification given below:

1. NPK 24-24-16 (SRI NUTRI SATTHA)
2. NPK 19-19-19 (TRIPLE POWER)
3. NPK. 13-40-13 (HIGH POWER)
4. NPK 15-8-35 (SRI NUTRI GREEN)
5. N:16 P:0 K: 9 S:19 (HILY)
6. NPK 10-5-30 (SRI NUTRI RAJA)

In above water-soluble Fertilizers, the detailed specification is **1. NPK 24-24-16** (Moisture- 0.5% max, Total Nitrogen-24.00% min, Water soluble P205-24.00% min, Water soluble K20- 16.00% min, Insoluble matter-.5% max) **2. NPK 19-19-19** (Total Nitrogen-19.0% min, Water soluble Phosphate as P205-19.0% min, Water soluble Potash as K2O-19.0% min, Matter insoluble in water-0.5% max, Moisture-0.5% max) **3. NPK 13-40-13** (Total Nitrogen-13.0% min, Water soluble phosphate as P205-40.0% min, Water soluble Potash as K20-13.0% min, Sodium as NaCL on dry basis-0.15% max, Matter insoluble in water-0.5% max) **4. NPK 15- 8-35** (Total Nitrogen N-15%, Total Phosphorus P-8%, Total Potassium K-35%, Carbon Zymogen powder C-2C, Potassium Fulvic-4%, Humidity-Max 4%, Solubili- ty-100% PH Data 6-7) **5. N:16 P:0 K: 9 S:19** (Total Nitrogen-16%, Phosphorus-0%, Potassium- 9%, Sulphur- 19%) **6. NPK 10-5-30** (Total Nitrogen percent by weight-10.0% min, Water soluble Phosphates as P205-5.0%min, Water soluble Potash as K20-30.0%min).

We assure that all procedures as laid out in the notification shall be followed and adhered to:

Thanking You.
Yours Truly,
For Srikar Biotech Pvt. Ltd.
Sd/- Linga Srinivasa Rao
Managing Director

సంపాదకీయం

దేశ ద్రోహం కేసుల్లో అత్యధికం నిర్దోషులే

ఉగ్రవాదం మీద పోరాటం పేరుతో ప్రభుత్వం రాజ్య ఉగ్రవాదాన్ని ప్రజల మీద రుద్దుతోంది. నిరసనకారులను ఏకపక్షంగా ఉగ్రవాదులుగా ప్రకటించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా-యూఏపీఏ)ను మోదీ ప్రభుత్వం తీవ్రంగా దుర్వినియోగం చేస్తోంది. ఈ చట్టం వల్ల తనకు నచ్చని, ప్రశ్నించే, విమర్శించే వారిపై ఉగ్రవాదిగా ముద్రవేసే అధికారం ప్రభుత్వం చేతిలో ఉంటుంది. చట్టంలోని సెక్షన్ 35, 36 ప్రకారం ఎలాంటి మార్గదర్శకాలు, నిర్దేశించిన విధానం లేకుండా ప్రభుత్వం ఒక వ్యక్తిని ఉగ్రవాదిగా ప్రకటించవచ్చు. సాక్ష్యాలను, ఆధారాలను పరిశీలించి కోర్టులు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేకపోవడంతో రాజకీయ, సైద్ధాంతిక విభేదాల ఆధారంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎందరినో లక్ష్యంగా చేసుకుని వారిపై ఉపా కింద కేసులను బనాయిస్తోంది. ఉపా కింద నమోదైన కేసుల్లో నేరారోపణలు రుజువు చేయడం కష్టసాధ్యంగా ఉందని, అటువంటి కేసులలో దర్యాప్తును నిర్వహించడంలో విపరీతమైన సంక్లిష్టత కారణంగా ఉందని, దీనికి ఉన్నత స్థాయి వృత్తి నైపుణ్యం అవసరమని భద్రతా నిపుణులు అంటున్నారు. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించే కార్యకలాపాలను సమర్థవంతంగా అడ్డుకోడానికి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి 1967లో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య 2019 ఆగస్టులో ఈ చట్టానికి వివాదాస్పద సవరణలు చేశారు. నిరసనకారులను ఏకపక్షంగా ఉగ్రవాదులుగా ప్రకటించడం అందులో ప్రధాన సవరణ. ఈ సవరణప్రకారం ఒకరిపై ఉగ్రవాదిగా ముద్రవేసే అధికారం ప్రభుత్వం చేతిలో ఉంటుంది. దానికి సంబంధించిన సాక్ష్యాలను, ఆధారాలను పరిశీలించి కోర్టులు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. మన న్యాయ వ్యవస్థలో ఒక నిందితుడు దోషిగా నిరూపణ అయ్యే వరకు నిర్దోషి కిందే లెక్క కానీ ఇక్కడ విచారణకు ముందే ఉగ్రవాదిగా ముద్రవేస్తారు. అది రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు విరుద్ధం అన్న ప్రతిపక్షాల ఘోషను మోదీషా ద్వయం ఏమాత్రం ఖాతరు చేయకుండా మందబలంతో సవరణలకు ఆమోదముద్ర వేసుకున్నారు. 2019కి ముందు ఈ చట్టంలో ఐదుసార్లు మార్పులు, చేర్పులు జరిగాయి. 1995లో టాడా, 2004లో పోటా చట్టాలు రద్దయ్యాక, అదే సంవత్సరం నుంచి యూఏపీఏ చట్టంలో గణనీయమైన మార్పులు జరిగాయి. టాడా, పోటా చట్టాలు అమలులో ఉన్నప్పుడు తీవ్ర స్థాయిలో దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలున్నాయి. పోటాలోని కొన్ని నిబంధనలను ఇందులో చేర్చారు. టెర్రరిస్టు నిందితులకు సంబంధించి చార్జ్‌షీట్ వేయకుండానే 180 రోజులు నిర్బంధంలో ఉంచేలా ఈ చట్టంలో నిబంధనలు చేర్చారు. 2008లో ఉగ్రవాదం అనే మాటకు విస్తృతమైన అర్థాన్ని నిర్వచిస్తూ ఈ చట్టంలో మార్పులు చేశారు.

రాజకీయ కారణాలతో ప్రభుత్వం మోపుతున్న రాజద్రోహం కేసులలో ఎక్కువ మంది నిర్దోషులుగా బయటపడుతున్నారు. కఠినమైన ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో నేరారోపణలు రుజువు చేయడం లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు కష్టంగా ఉందని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డేటా స్పష్టం చేస్తోంది. 2014 నుంచి 2022 వరకు ఈ చట్టం కింద మొత్తం 8,719 కేసులు నమోదు అయ్యాయి. వీటిలో 567 కేసులలో దోషులు నిర్దోషులుగా తేలింది. ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం ఈ చట్టం కింద కేసులు బనాయించిన వారిలో మోదీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి నేరారోపణల రుజువు అయిన వారికంటే, నిర్దోషులే చాలా ఎక్కువగా ఉన్నారు. 2014 నుంచి 2022 వరకు మధ్యలో ఒక సంవత్సరం మినహా అన్ని సంవత్సరాలు ఈ చట్టం కింద నేరారోపణలు ఎదుర్కొన్న వారికన్నా నిర్దోషులుగా అత్యధిక సంఖ్యలో విడుదలయ్యారు. ఈ చట్టానికి ముందున్న టాడా కింద అరెస్టయిన 76,036 మందిలో ఒకశాతం మందిపై మాత్రమే అభియోగాలు మోపారు. 2004లో పోటా చట్టం రద్దయ్యే సమయానికి 1031మందిని అరెస్టు చేశారు. వీరిలో 18మందిపై మాత్రమే విచారణ జరిగింది. 13మందిని దోషులుగా నిర్ధారించారు. 2014 నుంచి 2016 వరకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం ఉపా చట్టం కింద మోపిన 75శాతం కేసుల్లో నిందితుల విడుదల లేదా నిర్దోషులుగా ప్రకటించడం జరిగింది. 2014లో 976 కేసులు నమోదు చేసినప్పటికీ కేవలం తొమ్మిది మంది మాత్రమే దోషులుగా తేలారు. 24 కేసుల్లో నిర్దోషులుగా ప్రకటించారు. 2015లో 76 కేసులు నమోదు చేసినప్పటికీ కేవలం 11 కేసులలో మాత్రమే నేరారోపణలు నమోదు చేశారు. 65 కేసుల్లో నేరారోపణలు రుజువుకాకపోవడంతో నిందితులు నిర్దోషులుగా బయటపడ్డారు. 2016లో 33 కేసులు నమోదు చేయగా 22 కేసుల్లో నిందితులను నిర్దోషులుగా ప్రకటించారు. 2017లో ప్రభుత్వం అత్యధికంగా నిర్దోషులపై అక్రమ కేసులు బనాయించింది. ఈ సంవత్సరం 34 మందిపై ఉపా చట్టం క్రింద కేసులు బనాయించగా వారిలో ఒక్కరే దోషిగా తేలారు. మిగిలిన 33 మందిని నిర్దోషులుగా ప్రకటించారు. 2015తో పోలిస్తే ఉపా కింద మోపిన కేసులలో అరెస్టు అయిన వారి సంఖ్య 2019లో 75 శాతం పెరిగింది. 2019లో దేశవ్యాప్తంగా నమోదైన 1226 కేసుల్లో 1948 మంది వ్యక్తులు ఈ చట్టం కింద అరెస్టయ్యారు. 2015-2018లో నమోదైన కేసులు వరుసగా 897, 922, 901, 1182 కాగా, అరెస్టయిన వారి సంఖ్య వరుసగా 1128, 999, 1514, 1421. వీటిలో నిర్దోషుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నది. విమర్శలను సహించలేని మోదీ ప్రభుత్వం ఈ కాలంలో ప్రశ్నించిన వారిలో అత్యధికులపై ఈ చట్టం కింద కేసులు నమోదు చేసి విమర్శకుల నోరు నొక్కేసేందుకు తీవ్రంగా ప్రయత్నించడంతో కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2018లో 68 కేసుల్లోనూ, 2019లో 64 కేసుల్లోనూ నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. 2020లో నిర్దోషుల సంఖ్య 99కి పెరగగా, నేరారోపణలు 27కి తగ్గాయి. 2020లో నిర్దోషుల సంఖ్య 99కి పెరగగా, నేరారోపణలు 27కి తగ్గాయి. 2021లో కూడా ఇదే ధోరణి కొనసాగింది. 39 మందిని నిర్దోషులుగా ప్రకటించగా, 27 మందిపై నేరారోపణలు మోపారు. 2022 సంవత్సరంలో అత్యధికంగా 153 మంది నిర్దోషులుగా విడుదలయ్యారు. 2018 టెర్రర్ గ్లోబల్ ఇండెక్స్ ప్రకారం టెర్రరిస్టు చట్టాల ద్వారా పాశ్చాత్య దేశాలు ఉగ్రవాదాన్ని చాలావరకు నియంత్రించగలిగాయి. విచారకరమేమంటే మన దేశంలో మాత్రం వాటి ఫలితాలు తారుమారవుతున్నాయి. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం సంకుచిత రాజకీయ ప్రయోజనాలను, కుయుక్తులను విడనాడి విమర్శలను సహృదయంతో స్వీకరించాలి. ప్రశ్నించే వారికి అవకాశం కల్పించాలి. అంతే తప్ప ఇటువంటి చట్టాలను దుర్వినియోగం చేయడం తగదు.

ప్రజాస్వామ్య సామ్యవాది దాశరథి

డాక్టర్ సి ఎస్ క్షేత్రపాల్ రెడ్డి

జనం మాటను ఆకాశమంత ఎత్తున నిలబడి కవిత్వమై, పద్యమై వినిపించిన మహాకవి దాశరథి. ప్రజాకవిగా దాశరథి కృష్ణమాచార్య కలం నుంచి, కంఠం నుంచి బయట పడ్డ ప్రతి అక్షరం జనంలో చైతన్యం నింపింది. సమసమాజం పట్ల బలమైన ఆకాంక్ష దాశరథిది. తెలంగాణ నేలపై ఉద్యమ కవితలు పండించిన మహాకవి దాశరథి. తన కవితల ద్వారా నిజాం పాలనకి వ్యతిరేకంగా సాగే పోరాటలకు ఊపిరులు ఊదాడు. స్వయంగా ఉద్యమంలో పాల్గొన్న కవి. చిన్న వయసులోనే పెద్ద బాధ్యతను తలపై పెట్టుకొని జైలు గోడల మీద అక్షరాలై మెరిశాడు. జన సామాన్యం పాలిట కంటకపాలన సాగిస్తున్న నిజాం నిరంకుశాన్నీ తన కలం అనే ఆయుధంతో చీల్చి చండాడాడు. ఆయన కవిత్వం నిండా సమస్యల ప్రస్తావన, అందుకు గల కారణాలు, మార్పునకు అవసరం అయిన ఆలోచనలు కనిపిస్తాయి. ప్రతి అక్షరం అభ్యుదయ భావాలతో దర్శనమిస్తుంది. సమాజంలో నెలకొన్న అన్ని రుగ్మతలపై కవిత్వం అలంబనగా పోరాటం చేశారు. రాజీ పడని జీవితం ఆయనది. ముసలి నక్కకు రాజరికమా అని గర్జిస్తూ ఈ తెలంగాణ రైతులదేనని తీర్పు చెప్పారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని కీర్తించాడు దాశరథి కృష్ణమాచార్య.

దాశరథి కృష్ణమాచార్య వరంగల్ జిల్లాలోని చినగూడూరు గ్రామంలో జన్మించాడు. జూలై 22, 1925న జన్మించిన దాశరథిపై చిన్నప్పుడే అభ్యుదయ భావాల ప్రభావం పడిరది. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్‌స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఉర్దూకవి ఇక్బాల్ కవిత్వం తనపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయనే చెప్పుకున్నారు. 'ఏ పొలమున నిరుపేదకు దొరకదో తిండి, ఆ పొలమున గల పంటను కాల్చేయండి' అనే పద్యం తన హృదయానికి ఉద్రేకం కలిగించేదని చెప్పుకున్నారు. అత్యంత చిన్న వయసులోనే సాహిత్యాన్ని ప్రజా సంక్షేమంకోసం సృజియించిన కృష్ణమాచార్య గొంతు నుంచి ఆలపించబడిన పద్యాలు, కవితలు పదునైన ఆయుధాలుగా మారాయి. తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించాయి. ముసలి నక్కకు రాజరికమా అంటూ నిలదీస్తూ ఈ తెలంగాణం రైతులదేనని నినదిస్తూ 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్వంగా ప్రకటించిన మహాకవి పోషించినపాత్ర అనన్య సామాన్యం.

నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు దుర్భర జీవితాలను గడిపేవారు. నిజాం నిరంకుశ పరిపాలనలో ప్రజలకు ఎలాంటి స్వేచ్ఛ ఉండేది కాదు. ప్రజలు తమ మనసులోని కోర్కెలను తెలుపడానికి వీలుండేది కాదు. సభలు ఏర్పాటుచేసి తమ కష్టాలను, బాధలను చెప్పుకోవడమనేది అసాధ్యం. ప్రజలపై అధికపన్నులు విధించడం, వారి భూములను లాక్కోవడం సాధారణ అంశాలు. తెలంగాణ ప్రాంతంలో నవాబుల కింద పనిచేస్తున్న రజాకార్లు ప్రజలపాలిట నరభక్షకుల్లా తయారయ్యారు. నిజాం నవాబుల పరిపాలనలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఉండేవి కావు. ఈ నేపథ్యంలోనే ఉన్మాద, కిరాతక, నియంతృత్వ, నిరంకుశ నిజాం నవాబును ఎదురించిన ప్రజల గొంతుక దాశరథిది. నిజాం ప్రభువుకి వ్యతిరేకంగా గొంతు సవరించి ఓ నిజాము పిశాచమా అంటూ పాడుతూ నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని ఎలుగెత్తి వినిపించి తెలుగు నేలపై ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. ఆయన అందించిన సాహిత్యంలో అగ్నిధార, మహాంధ్రోదయం, 'రుద్రవీణ' 'మార్పు నా తీర్పు' 'ఆలోచనాలోచనాలు' 'ధ్వజమెత్తిన ప్రజ' తదితరాలు ఉన్నాయి. ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైనపాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం జైలుశిక్ష విధించింది. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడలమీద పద్యాలురాసి దెబ్బలు తిన్నాడు. మంచి ఉపన్యాసకుడిగా భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఈ కోరిక అయన కవిత్వం నిండా దర్శనమిస్తుంది.

సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసిన కలం కార్మికుడాయన. ఇదే ఆయన రాసిన 'రానున్నది' అనే కవితా ఖండికలో కనిపిస్తుంది. ఆ ఖండికలో...

రానున్నది యేది నిజం?
అది ఒకటే : సోషలిజం
కలపండోయ్ బుజం బుజం
కదలండోయ్ గజం గజం
అడుగడుగున యెడదనెత్రు
మడుగులుగా విడవండోయ్
పడిపోయిన గుడి గోడలు
విడిచిపెట్టి నడవండోయ్...అంటూ

సోషలిజం సాధన పట్ల తనకున్న బలమైన కోరికను వ్యక్తం చేశారు.

పోరాటాల నుండి కళ పుడుతుంది. నాజీవితం పోరాటం. ఎన్నో ప్రతీపశక్తులతో పోరాటం చేశాను. పోరాడుతున్నాను. ఇంకా పోరాడగలను. నేను ఆశావాదిని. దురాశావాదులు నిరాశ పడతారు. ఆశావాదికి నిరాశలేదు. నమ్రతతో నాదారిన నేను పయనిస్తాను. నా గమ్యం ప్రపంచ శాంతి. నా ధ్యేయం ప్రజాస్వామ్య సామ్యవాదం అని ప్రకటించిన దాశరథి ఆ ఆశయ సాధన కోసమే జీవితాంతం కృషి చేశారు. పద్యం రాసినా, కవిత్వం చెప్పినా, వచన కవిత పాడినా అంతటా పోరాటమే. ప్రజాకవులు ఎవ్వరూ ప్రేక్షకులు కాదు. వారు ప్రజల కష్టనష్టాల్లో కలసిపోతారు. కాబట్టే కవిత అయినా, పద్యమైనా కాల్పనికతతో ఉబుసుపోక రాసినవికావు. దాశరథి సాహిత్యం అంతా తెలంగాణ ప్రజా ఉద్యమమే. దాశరథిది సమర సాహిత్యం. సాహిత్యం నిండా జనం గుండెల జ్వాలలు, సెగలు, పొగలతో శక్తివంతమై కవిత్వంగా ప్రవహించింది.

'అనాదిగా సాగుతోంది అనంత సంగ్రామం-అనాథుడుకి, ఆగర్భ శ్రీనాథుడికి మధ్య'

అంటూ 'అనంత సంగ్రామం' కవితలో సమాజ పరిణామం క్రమాన్ని వెల్లడి చేశారు.

పెట్టుబడిదారి సమాజంలో రెండు విరుద్ధ శక్తుల మధ్య జరిగే పోరు పర్యవసానాలను అక్షరీకరిస్తూ....

'కార్మికులు, కర్షకులు, శాస్త్రవేత్తలు, మేధావులు
తమ శ్రమకు తగిన ఫలితం
ఇమ్మంటే "తిరుగుబాటు"
షావుకారు వడ్డీలకు, జామిందార్ల హింసలకు
వేగలేక ఆగలేక తిరగబడితే
"అతివాదం" అవుతున్నదని తనలోని అవేదనను వ్యక్తం చేశారు.

> సాహిత్యాన్ని ప్రజా సంక్షేమంకోసం సృజియించిన కృష్ణమాచార్య గొంతు నుంచి ఆలపించిన పద్యాలు, కవితలు పదునైన ఆయుధాలుగా మారాయి. తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించాయి. ముసలి నక్కకు రాజరికమా అంటూ నిలదీస్తూ ఈ తెలంగాణం రైతులదేనని నినదిస్తూ 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్వంగా ప్రకటించిన మహాకవి పోషించినపాత్ర అనన్య సామాన్యం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగానూ, ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుంచి కళాప్రపూర్ణ బిరుదును పొందిన దాశరథి సాహిత్యం ప్రజా ఉద్యమాలు నిర్వహించే వారందరికీ ఉద్యమ స్ఫూర్తి. ప్రజల కన్నీళ్లను, కడగళ్ళను తుడవడంకోసం జన సామాన్యం పక్షాన నిలిచిన ఆ మహాకవి తన అక్షరాలనే 'అగ్నిధార'లు గా మలచుకొని నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టారు. ఆయన రాసిన కవితా పుష్పకంకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. తిమిరంతో సమరంకు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం అందుకున్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో దాశరథి ఒకరు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేశారు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకునారు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించారు. తల్లి మీద, తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు నిత్య స్ఫూర్తినందిస్తాయి.

దాశరథి నిరుపేద గురించి చెబుతూ...

తరతరాల దరిద్రాల బరువులతో పరువెత్తే, నిరుపేదా!
విరుగుతోంది నీ మెడ పెరుగుతోంది నీ గుండెల్లో దడ...

అంటూ తాము చేస్తున్న శ్రమ విలువను గమనించని అమాయకుడని, అన్నార్తుడిగ మిగిలిపోతున్న వైనాన్ని పేర్కొంటూ నవ్య భవితకోసం అన్యాయపూరితమైన పాలకులపై విరుచుకుపడాలంటూ ఆయన చూపిన పోరుదారిలో శ్రామిక శక్తులన్నీ కలసికట్టుగా కృషిచేస్తూ ప్రజాస్వామ్య సామ్యవాదం అనే ఆశయ సాధనకోసం కంకణబద్ధులవుదాం.

(నేటి నుంచి రెండురోజుల పాటు విశాఖలో జరుగుతున్న దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాల సందర్భంగా)

సెల్: 9059837847

మంచి వ్యక్తిత్వం

చింతపట్ల సుదర్శన్

ఆకాశంలోకి ఏనుగుల గుంపు ఒకటి వచ్చి తొండాలతో నీళ్లు గుమ్మరిస్తున్నట్లు విసుగూ, విరామం లేకుండా కురుస్తున్నది వర్షం. కురిసే వర్షంలో తడిసి ఆకాశం ముఖం తెల్లబోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు మనుషులే కాదు అనేక ప్రాణులు తల్లడిల్లిపోతున్నాయి. ఆ అనేక ప్రాణుల్లో ఉన్నవీ డాంకీ డాగీలు. తడిసిన గోడకు ఆనుకుంటే ఎక్కడ కుప్పకూలుతుందోనని కాస్త దూరంగా కూచుంది డాంకీ. సగం విరిగిన తలుపుకి మరోపక్క ఉంది డాగీ. ద్వారపాలకుల్లా ఉన్న డాగీ, డాంకీలకు చేసేందుకు పనేమీ లేదు, దారాలు దారాలుగా, ధారలు ధారలుగా కురుస్తున్న వర్షం వైపు దిగులుగా చూడ్డం తప్ప. ఉలుకూ పలుకూ లేకుండా ఉన్న డాంకీ వైపు చూసింది డాగీ. డాంకీ కళ్లు మూసుకుని ఉంది. నిద్ర పోతున్నదో, నిద్ర నటిస్తున్నదో తెలీడం లేదు. ఊరికే తోక ఊపుకుంటూ కూచోడం నచ్చలేదు డాగీకి. అన్నా! నిద్రపోతున్నావా? అని అడగలేదు అరిచింది, వర్షం చప్పుడుకు డాంకీకి సరిగ్గా వినపడదేమోనని, కాస్సేపటి దాకా మూసుకుని ఉన్న కనురెప్పల తలుపులు తెరవని డాంకీ, డాగీ మళ్లీ అదే ప్రశ్నను రిపీట్ చేయ్యడంతో

రంగస్థలం

తప్పనిసరై కళ్లు తెరిచింది. ఏమిటి తంబీ ఆ అరుపులు. ఎందుకు డిస్ట్రబ్ చేస్తున్నావు అంది. అక్కడికి నువ్వేదో బల్లకట్టులో నడిరేయి వరదల్లో కొట్టుకుపోయే జనాన్ని పరామర్శించే పనిలో 'బిజీ' గా ఉన్నట్టు, డిస్ట్రబ్ చేస్తున్నానంటున్నావు అంది డాగీ ముక్కు ఉబ్బిస్తూ. ఊరు మునిగేక వచ్చే లీడర్‌ని కాదోయ్, ఉన్నచోటు నుంచి కదలకుండా నష్టపరిహారం ఇంత ఇవ్వాలని డిమాండ్ చేసే ప్రతిపక్ష నాయకుడ్నీ కాదు. మనకు చేయడానికి పని ఏదీ లేనప్పుడు, పంటి కిందకి నమలడానికి ఏదీ దొరకనప్పుడు 'మెడిటేషన్' చెయ్యాలన్నాడు ఓ స్వామీజీ ఆ మధ్య. ధ్యానం చేయడం ఆకలి దప్పుల్ని మరచిపోవడానికేనని అప్పుడర్థమైంది. ఇప్పుడు సమయం, సందర్భం రెండూ కుదిరాయి కనుక ధ్యానం చేసుకుంటున్నాను. నువ్వూ కళ్లు మూసుకుని ధ్యానం చేసుకుంటే ఏ సమస్యా ఉండదు అంది డాంకీ. అవునా! నిజమా! ధ్యానమా! ఓకే. నేనూ ట్రై చేస్తాను' అంటూ కళ్లు మూసుకుంది డాగీ.

అలా కళ్లు మూసుకున్న డాగీ, కళ్లముందు కనపడ్డ వస్తువును చూసి ఉలిక్కిపడ్డది. ఒక్క ఉదుటన్న కళ్లు తెరిచింది. డాంకీ బ్రో! ధ్యానం అంటే ఆషామాషీ వ్యవహారం కాదనిపిస్తున్నది. కళ్లు మూసుకుంటే, మాంసం కొట్టూ, నా మీదకి వచ్చిపడిన ఎముకా మాత్రమే కనిపిస్తున్నాయి అంది. నిజమేనోయ్ ధ్యానం అనేది లాకాయి లూకాయి, వ్యవహారం కానేకాదు. కళ్లు మూసుకుంటే నాకు నిన్నటిదీ మొన్నటిదీ కాక, ఇవ్వాళటి తాజా న్యూస్ పేపర్ కనిపిస్తున్నది. దాని వాసన ముక్కు పుటాలను ఎగరేస్తున్నది. దేనికయినా 'స్ట్రాంగ్ డిటర్మినేషన్' ఉండాలని అన్నాడు గిరీశం విడో మ్యారేజి విషయంలో. అభ్యాసం కూసు విద్య అన్నారు. ట్రై చేస్తూ ఉన్నా. నువ్వూ ట్రై చేస్తూనే ఉండు 'రోమ్ వజ్ నాట్ బిల్ట్ ఇన్ ఎ డే' అన్నారు. ప్రాక్టీస్ మేక్స్ మ్యాన్ పర్‌ఫెక్ట్ అనీ అన్నారు'. మ్యాన్‌కు బదులు, మనం డాగీ, డాంకీ అనీ అప్లయి చేసుకోవచ్చు. కళ్లు గట్టిగా మూసుకుందాం. కాస్సేపటికి భ్రమలన్నీ తొలగిపోయి జ్ఞాన నేత్రం ఓపెన్ అవుతుందని నమ్ము అంటూ డాంకీ కళ్లు మూసుకుంది. డాగీ ఫాలో అయింది. ఏమయింది మీకు చెరో పక్కా కళ్లు మూసుకు కూచున్నారు అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. ధ్యానం మాట మరచిపోయి కళ్లు తెరిచాయి నాలుగు కాళ్ల ప్రాణులు రెండూ. నువ్వా బ్రో ఈ వర్షంలో వస్తావనుకోలేదు అంది డాగీ. వర్షం కాస్త 'ఇంటర్వెల్' ఇచ్చింది. ఇంటి దగ్గర 'బోర్' కొట్టి ఇలా వచ్చా. మీరిద్దరూ జాయింటుగా నిద్రపోతున్నట్టున్నారు అన్నాడు అబ్బాయి. నిద్ర కాదు బ్రో ఇది. మెడిటేషన్ అనగా ధ్యానం అనగా తపస్సు అంది డాంకీ. ధ్యానం, తపస్సూ మనుషులకు సంబంధించిన సబ్జక్టు ముఖ్యంగా మంచి వ్యక్తిత్వం ఉన్న సత్పురుషులకూ, పురుషోత్తములకూ సంబంధించిన విషయం అన్నాడు అబ్బాయి. వ్యక్తిత్వం సరే వ్యక్తులకు ఉండేది వ్యక్తిత్వం అనుకుందాం. కొందరు వ్యక్తులకు పశుత్వం ఉంటుంది అది వేరే విషయం. కానీ మంచి వ్యక్తిత్వం, చెడ్డ వ్యక్తిత్వం అనేవి కూడా ఉంటాయా? అంది డాగీ. 'లింగ్విస్టిక్స్' సంగతైతే 'చేకూరి' గారినడగాలి. మనకంత సీన్ లేదు. కాకపోతే ఈ మధ్య ఓ పార్టీ ప్రభుత్వనేతా, అధినేతా నోట 'మంచి వ్యక్తిత్వం' అనే పదం వినపడింది, కనుక వాడాను మరి అన్నాడు అబ్బాయి. మంచి వ్యక్తిత్వం అంటే ఏమిటని అడగొద్దన్నావు సరే దాని వాడకం సంగతేమిటి? అంది డాంకీ. చెప్తా! ఇటీవల ఓ పార్టీ నాయకుడు, అవతల పార్టీల్లో మంచి వ్యక్తిత్వం ఉన్నవాళ్లను మాత్రమే తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించేడు అన్నాడు అబ్బాయి. మంచి వ్యక్తిత్వమా అదెక్కడ లభిస్తుంది. అసలు ఏ పార్టీ వారైతేనేం రాజకీయ నాయకుల్లో అది మచ్చుకైనా కనిపిస్తుందా అని నా డవుటు అనగా సందేహానుమానం అంది డాగీ. మంచి వ్యక్తిత్వం అనేది వ్యక్తులు ఉన్న రంగాన్ని బట్టి బేరీజు వెయ్యాలనుకుంటా. రాజకీయ రంగంలో ఉన్న వ్యక్తులమీద ఎన్ని నేరాలు ఎక్కువగా ఉంటే అంత మంచి వ్యక్తిత్వం అనుకుంటా. కేసులు పైన ఉన్నవారే కదా మంత్రులూ, ముఖ్యమంత్రులూ అవుతున్నారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్నవాళ్లు జైళ్ల నుంచి బెయిళ్ల మీద బయటికి వస్తూ, జేజేలు కొడుతున్నారు, కొట్టించుకుంటున్నారు, కాళ్లు మొక్కించుకుంటున్నారు. ఇలాంటి వాళ్లే మంచి వ్యక్తిత్వం ఉన్నవాళ్ల కింద లెక్క కాబోలు అన్నాడు అబ్బాయి.

జేజేలు కొట్టే అనుచరులు, కుస్తీలు పట్టే కార్యకర్తలు ఎన్నికల్లో ఓట్లు కొనే సామర్థ్యమూ ఉన్నవాళ్లు ఏ పార్టీ వారికైనా అవసరమే. అలాంటి వాళ్లు అధికార పార్టీ స్వంత బలం పెంచుకోవడానికి అవసరం కనుక వాళ్లే వ్యక్తిత్వం, అదే మంచి వ్యక్తిత్వం ఉన్నవాళ్లు అంది డాగీ. నేరాలు, ఘోరాలు చేసేవాళ్లు, అర్థబలం, అంగబలం ఉన్నవారు మంచి వ్యక్తులన్న మాట. పదాలకు అర్థాలు మార్చే మనుషుల గురించి ఆలోచించడం కంటే మెడిటేషన్ అనబడే ధ్యానం చేసుకోవడం మంచిది. కాస్సేపు కాల్చేసే ఆకలినీ, ముంచేసే వరదల్నీ మరచిపోవచ్చు అంటూ కళ్లు మూసుకుంది డాంకీ.

ప్రజాసంస్కరణల్లో కేరళ టాప్

పి.శ్రీకుమరన్

కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకత్వంలోని యుడీఎఫ్, బీజేపీలు తరచుగా విమర్శిస్తుంటాయి. అయితే కేరళ ప్రభుత్వం వాణిజ్యంలోనూ, ప్రజలకు అనుకూలమైన సంస్కరణలు అమలు జరపడంలో అగ్రస్థానం పొందింది. ఈ విజయాన్ని చూసిన ఈ రెండు పక్షాలు ఇప్పుడేం మాట్లాడాలో తెలియని పరిస్థితి ఎదురై మౌనంగా కూర్చున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం కేరళ సాధించిన విజయాలను కనీసం ప్రస్తావించడంలేదు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకంటే కేరళ ప్రభుత్వం అనేక విషయాలలో ముందంజలోనే ఉంది. అయినప్పటికీ బీజేపీ, యుడీఎఫ్‌లు కేరళ ప్రభుత్వాన్ని విమర్శించడలో వెనుకాడడంలేదు. ఢిల్లీలో సెప్టెంబరు5న జరిగిన వివిధ రాష్ట్రాల పరిశ్రమల మంత్రులు పాల్గొన్న సమావేశంలో కేంద్ర పారిశ్రామిక వాణిజ్యమంత్రిత్వశాఖ ఈ విజయాన్ని ప్రకటించింది. వివిధ రాష్ట్రాల రేటింగ్‌లను ఈ సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో కేరళ పరిశ్రమల శాఖమంత్రి పి.రాజీవ్ వాణిజ్య సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక-22 అవార్డును కేంద్ర పారిశ్రామిక శాఖ మంత్రి పియుష్ గోయల్ నుంచి అవార్డును స్వీకరించారు. పరిశ్రమలను, అంతర్జాతీయ వాణిజ్యాన్ని పెంపొందించినందుకుగాను కేరళకు అవార్డు లభించింది. వాణిజ్యం, పన్నుల చెల్లింపు, పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంలోనూ కేరళ ముందంజలో ఉంది. వాణిజ్య కేంద్రీకృత సంస్కరణలలో దేశంలోనే గొప్ప విజయం సాధించిన రాష్ట్రాలలో కేరళ అగ్రస్థానంలోఉంది. ప్రజా ప్రయోజనాల సంస్కరణలలో ఏడు కేటగిరీలు ఉన్నాయి. ఈ ఏడుకూడా ఉన్నతస్థానంలోనే ఉన్నాయి. అవి-అన్‌లైన్ సింగల్ విండో సిస్టమ్, పట్టణ, స్థానిక సంస్థలు అత్యంత వేగంగా వివిధ సర్టిఫికేట్‌లను అందచేయడం, రెవెన్యూశాఖ సర్టిఫికేట్లను జారీచేయడంలో, ప్రజలకు నిత్యజీవితావసర వస్తువులను పంపిణీ, రవాణా రంగంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజిల నిర్వహణలోనూ రాష్ట్రం ముందంజలో ఉన్నది. ఈ సంస్కరణలలో కేరళ 95శాతానికి పైగా సానుకూల స్పందనలు వివిధ వర్గాలనుంచి వచ్చాయి. సరళతర వాణిజ్యంలో కేరళ గొప్ప విజయాలను సాధించిన విషయాలను అనేక సంస్థలు ప్రశంసించాయి. అనేక పారిశ్రామిక సంస్థలలో గుర్తింపుపొందిన విజయాలను ప్రభుత్వం సాధించింది. డిజిటల్ సాంకేతిక సాధనాలు కలిగిన ఉన్నతస్థాయి సాంకేతికతను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దింది. సైబర్ నేరాలను నియంత్రించడంలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ కేరళను గుర్తించింది. భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం సైబర్ నేరాలను నియంత్రించడంలో కేరళ ప్రభుత్వం సాధించిన విజయానికి కేంద్ర హోం మంత్రిత్వశాఖ మంత్రి అమిత్ షా త్వరలో బహుమతిని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి సెప్టెంబరు 11వ తేదీ బుధవారం ఈ బహుమతిని అందచేస్తారు.

కోజికోడ్ నగరంలో ప్రభుత్వ సైబర్‌పార్కు ఉన్నది. దీని ద్వారా సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 2023-24లో 121కోట్ల ఎగుమతులతో అంతకుముందు సంవత్సరంకంటే 2023-24లో 15శాతం వృద్ధిని సాధించింది. గత ఏడేళ్లకాలంలో 40 రెట్లు వృద్ధిని నమోదుచేశారు. 2023-24లో ఎగుమతుల ద్వారా సైబర్ పార్కులు 105కోట్ల ఐటీ ఎగుమతులు చేశాయి. 2016-17లో 2.97కోట్లు విలువైన ఎగుమతులు జరిగాయి. ఇవి క్రమంగా 2017-18నాటికి 71,390కోట్ల విలువైన ఎగుమతులకు చేరాయి. ఆ తరువాత సంవత్సరంలో ఇవి 8,10,97,095 రూపాయల విలువైన ఎగుమతులకు చేరాయి. పశ్చిమాసియా, అమెరికా, ఐరోపా తూర్పు ఆసియా దేశాలకు ఐటీ ఎగుమతులు గణనీయంగా జరిగాయి. 2009లో 42.5ఎకరాల స్థలంలో సైబర్‌పార్కు భవనాన్ని స్థాపించినట్లుగా సైబర్ పార్కు సీఈఓ సుశాంత్ కురింతిల్ తెలిపారు. 3లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 82 కంపెనీలు పనిచేస్తున్నాయి. 2200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కేరళ స్టార్టప్ మిషన్ పరిధిలో 22కంపెనీలకు సైబర్‌పార్కు తోడ్పాటు అందిస్తున్నది. దేశంలో యూపీఎస్సీ నియమించే ఉద్యోగులలో కేరళ అగ్రస్థానంలోఉన్నది. ఉదాహరణకు 2023లో రాష్ట్రంల 34,110 నియామకాలు జరిగాయి. ఈ నియామకాలలో 11,921 మంది ఓబీసీలు ఉండగా, ఎస్‌సీలు 2673 మంది ఉన్నారు. అలాగే ఎస్‌టీలు 2260 మంది ఉన్నారు. మరో 17,256 మంది జనరల్, ఇతర కేటగిరీల కింద నియమితులయ్యారు. గత సంవత్సరం దేశం మొత్తం మీద 1,16,089 మంది మాత్రమే నియమితులయ్యారు. ఇందులో దాదాపు సగం మంది అనగా 34,110 మందిని కేరళ నియమించింది. 23కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ కేవలం 4,120 మంది ఉద్యోగులను మాత్రమే నియమించింది.

దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఐటీ ఉద్యోగుల నియామకాలలో కేరళ అగ్రస్థానంలో ఉంది. తమిళనాడు 12,645 మందిని, మహారాష్ట్ర 3,949మందిని, ఉత్తరాఖండ్ 4,355 మందిని, ఆంధ్రప్రదేశ్ 332 మందిని అసోం 635 మందిని, చత్తీస్‌ఘడ్ 773 మందిని, బీహార్ 3173మందిని, హిమాచాల ప్రదేశ్ 1332 మందిని నియమించాయి. కేరళలో 20 ప్రభుత్వరంగ యూనిట్లలో ఈ సంవత్సరం లాభాలలో ఉన్నాయి. కేంద్రప్రభుత్వం మాత్రం ఇలాంటి సంస్థలను మాత్రం అయినకాడికి విక్రయించాలని నిర్ణయించింది. కొచ్చి-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను కూడా ప్రైవేటు రంగానికి అప్పగించాలని కేంద్రం చూస్తోంది. గుజరాత్‌కు చెందిన కంపెనీ కేరళలోని కాసరగాడ్ జిల్లాలో 850కోట్లు పెట్టుబడులతో పారిశ్రామికవాడలను ఏర్పాటుచేసింది. ఈ విధంగా అనేకరంగాలలో కేరళ సాధించిన విజయాలను తప్పక ప్రశంసించవలసిందే.

లంచం ఇవ్వలేదు

వైద్యురాలి తల్లిదండ్రుల ఆరోపణలపై మమత

కోల్‌కతా: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసు దర్యాప్తులో పోలీసులు అక్రమాలకు పాల్పడ్డారంటూ బాధితురాలి తల్లిదండ్రులు చేసిన ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ సోమవారం స్పందించారు. వారు చేసిన ఆరోపణలను మమత కొట్టిపారేశారు. తమ ప్రభుత్వంపై అపనిందలు వేసే ప్రయత్నమంటూ మండిపడ్డారు. 'బెంగాల్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం జరుగుతోంది. బాధితురాలి తల్లిదండ్రులకు మేము ఎప్పుడూ డబ్బు ఇవ్వలేదు. ఒక నిండు జీవితాన్ని డబ్బు ఎప్పటికీ భర్తీ చేయలేదు. కానీ, వారి కుమార్తె జ్ఞాపకార్థం ఏదైనా మంచి పని చేయాలని భావిస్తే... వారికి మా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చా. ఆ విషయంలో వారు నన్ను ఎప్పుడైనా సంప్రదించవచ్చు. ఎప్పుడు ఏం మాట్లాడాలో నాకు తెలుసు' అని మమత చెప్పారు. కాగా, కోల్‌కతాలో వైద్యుల ఆందోళనపై మమత స్పందించారు. 'ఇదంతా కేంద్రంలోని బీజేపీ చేస్తున్న కుట్ర. ఇందులో వామపక్షాలు కూడా ఉన్నాయి. మా ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నాయి. పొరుగు దేశంలోని పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. భారత్, బంగ్లాదేశ్ రెండూ వేర్వేరు దేశాలు అనే విషయాన్ని మర్చిపోయారు' అని మమత ఆరోపించారు. నిరసలు కొనసాగిస్తున్న వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని సీఎం కోరారు. నిరసనల నేపథ్యంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ రాజానామా చేశారని తెలిపారు.

కేంద్రమంత్రికి అధికారి సపర్యలు

రాంచి: కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే షూను భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ అధికారి తీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ప్రతిపక్షాలు ఆయనను విమర్శిస్తున్నాయి. మంత్రి సతీశ్ చంద్ర దూబే ఆదివారం జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఉన్న కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) సందర్శనకు వెళ్లారు. ఆయన భూగర్భ గనిలో పరిశీలనకు వెళ్లడానికి ముందు బీసీసీఎల్ ఉన్నతాధికారి ఒకరు మంత్రి షూ తీసి... ఆయన పైజామా సరి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో గురించి బీసీసీఎల్ అధికారిని మీడియా ప్రశ్నించగా వారితో మాట్లాడడానికి ఆయన నిరాకరించారు. కాగా, ఈ ఘటనపై ధన్‌బాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోశ్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఉన్నతస్థాయి అధికారితో షూ విప్పించి... ఆయనను అగౌరవపరిచినందుకు కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ అధికారికి పదోన్నతి కల్పించాలన్నారు.



బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం

న్యూఢిల్లీ: రాబోయే శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో కాలుష్య నియంత్రణే లక్ష్యంగా బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. నిషేధం వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు అమలులో ఉంటుందని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు. బాణసంచా ఆన్‌లైన్‌లో విక్రయం, డెలివరీలకూ నిషేధం వర్తిస్తుందని తెలిపారు. దీన్ని కఠినంగా అమలు చేసేందుకు ఢిల్లీ పోలీస్, ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్న 21 ఫోకస్ పాయింట్ల ఆధారంగా శీతాకాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగానే తాజా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

హర్యానాలో జాట్‌ల ఓట్లు ఎటువైపు

వినేశ్ ఫొగాట్ కాంగ్రెస్‌ను గెలిపిస్తారా?

చండీగఢ్: హర్యానా శాసనసభ ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దేశ రాజధానికి సమీపంలో ఉన్న హర్యానాలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఆసక్తి రేపుతోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హర్యానాలో బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకూడదని రెండు పార్టీలు భావిస్తున్నాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కులాల ప్రభావం ఎక్కువగా ఉండే హర్యానాలో ఈసారి ఏ వర్గం ఏ పార్టీవైపు మొగ్గు చూపుతుందనేది ఆసక్తిగా మారింది. కొంతకాలంగా కొనసాగుతున్న రెజ్లర్ల ఆందోళన ఈ ఎన్నికలపై ఎంత ప్రభావం చూపిస్తుందనేది కీలకంగా మారింది. రెజ్లర్ల ఆందోళనలో కీలక పాత్ర పోషించిన మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కాంగ్రెస్‌లో చేరారు. ఆమె ఈ ఎన్నికల్లో జులనా శాసనసభ స్థానం నుంచి పోటీచేస్తున్నారు. ఆమె కాంగ్రెస్ పార్టీని హర్యానాలో అధికారంలోకి తీసుకువస్తారా... జాట్ల ఓట్లను ఐక్యం చేస్తుందా అనే చర్చ హర్యానా రాజకీయాల్లో హల్‌చల్ చేస్తోంది. జాట్ సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడంతో పాటు రైతు ఉద్యమాలకు ఆమె మద్దతు ఇవ్వడం, పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌కు చేరి, అధిక బరువు కారణంగా పతకాన్ని కోల్పోవడం వంటి సంఘటనల ద్వారా యువతలో ఆమెపై ఆదరణ పెరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా మహిళలు, రైతులు, యువతలో ఆమెకు ఉన్న ఆదరణ కారణంగా కాంగ్రెస్ పార్టీకి గెలుపు అవకాశాలు పెరిగినట్లేనని రాజకీయ విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు.

హర్యానా జనాభాలో జాట్‌లు 22 నుంచి 27 శాతం ఉన్నారు. 2019లో బాలాకోట్ వైమానిక దాడుల అనంతరం దేశవ్యాప్తంగా జాతీయవాద శక్తులు ఐక్యం కావడంతో ఆ ఎన్నికల్లో హర్యానాలో బీజేపీ గెలుపొందింది. 2019 ఎన్నికల తర్వాత బీజేపీకి హర్యానాలో పెద్దగా ఆదరణ లభించలేదు. అయితే జాట్‌ల ఓట్ల చీలిక బీజేపీకి కలిసివచ్చింది. కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ లోక్ దళ్, జననాయక్ జనతా పార్టీ మధ్య జాట్ ఓట్లు చీలిపోవడం వల్ల బీజేపీ లాభపడింది. గత ఐదేళ్లలో రైతులు, రెజ్లర్లు, అగ్నివీరుల నిరసనలు, కుల రాజకీయాల కారణంగా హర్యానాలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. జాట్ వర్గాన్ని బీజేపీ నిర్లక్ష్యం చేసిందనే అభిప్రాయం ఆ సామాజిక వర్గం నేతల్లో నెలకొంది. ఈ ప్రభావం 2024 సార్వత్రిక ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హర్యానాలో జాట్‌లు 64 శాతం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కూటమికి ఓట్లు వేయగా... 27 శాతం మంది బీజేపీకి, ఇతర పార్టీలకు తొమ్మిది శాతం మంది ఓట్లు వేశారు. 2019తో పోలిస్తే జాట్ సామాజిక వర్గం ఓట్లు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ కూటమికి 40 శాతం పెరగ్గా... బీజేపీకి 23 శాతం మేరకు తగ్గాయి. ఇతర పార్టీలకు 17 శాతం తగ్గడంతో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపడింది. హర్యానాలో 37 నియోజక వర్గాల్లో జాట్ సామాజికవర్గం దాదాపు 20 శాతానికి పైగా ఉంటుంది. ఈ నియోజక వర్గాల్లో గెలుపోటములను జాట్‌లు నిర్ణయి స్తారు. రైతులు బీజేపీకి వ్యతిరేకంగా సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేశారు. వీరిలో జాట్ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. జాట్ సామాజిక వర్గానికి చెందిన వినేశ్ ఫొగాట్ కాంగ్రెస్‌లో చేరడంతో లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌వైపు జాట్ వర్గం ఓటర్లు మరింత మొగ్గు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వినేశ్ ఫొగాట్ చేరిక కాంగ్రెస్‌కు కలిసొస్తుందనే చర్చ జోరుగా సాగుతోంది.

మణిపూర్‌లో మోదీ ఘోరవైఫల్యం క్షమించరానిది: ఖడ్గే

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మరో మారు హింస చెలరేగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్ బీరెన్‌సింగ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని, భద్రతాపరమైన సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కాంగ్రెస్ సోమవారం డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మణిపూర్ విచారణ కమిషన్ తన విచారణను వేగవంతం చేయాలని కూడా పేర్కొంది. మరో పక్క మణిపూర్‌లో పరిస్థితిని నియంత్రించడంలో ప్రధాని నరేంద్ర మోదీ ఘోర వైఫల్యం క్షమించరానిదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'మణిపూర్‌లో ప్రధాని మోదీ ఘోర వైఫల్యం క్షమించరానిది. మణిపూర్ మాజీ గవర్నర్, అనుసూయా ఉకే జీ మణిపూర్ ప్రజల గొంతును ప్రతిధ్వనించారు. కలహాలతో అట్టుడుకుతున్న రాష్ట్ర ప్రజలు కలత చెందారని, విచారంగా ఉన్నారని, ప్రధాని మోదీ రాష్ట్రాన్ని సందర్శించాలని కోరుకున్నారని ఆమె అన్నారు' అని ఖడ్గే తెలిపారు. గత 16 నెలల్లో ప్రధాని మోదీ మణిపూర్‌లో ఒక్క సెకను కూడా గడపలేదని, రాష్ట్రంలో హింస నిరంతరాయంగా కొనసాగుతున్నప్పటికీ ప్రధాన మంత్రి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ ఇతర రాష్ట్రాల్లో రాజకీయ సభలు, ర్యాలీలపై దృష్టి సారిస్తూ తమ రాజ్యాంగ విధులను విస్మరించారని దుయ్యబట్టారు.

'మణిపూర్‌లో డ్రోన్, రాకెట్ ఆధారిత గ్రెనేడ్ దాడులు ప్రారంభమయ్యాయని... ఇది ఇప్పుడు దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నదని ఆయన అన్నారు. ఇలాంటి తీవ్రమైన పరిస్థితుల్లో బీజేపీ రాజీనామా డ్రామా ఆడుతోందని ఆయన అన్నారు. యూనిఫైడ్ కమాండ్‌ను బదిలీ చేయమని ముఖ్యమంత్రి ఇటీవల చేసిన అభ్యర్థన కూడా సమస్యాత్మక ధోరణిని ప్రతిబింబిస్తుందని ఖడ్గే ఎత్తి చూపారు. మణిపూర్ సీఎంను తక్షణమే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నట్లు ఖడ్గే చెప్పారు. రాష్ట్ర బలగాల సహాయంతో అన్ని రకాల తిరుగుబాటు గ్రూపులను ఉక్కు పాదంతో అణచివేయాలని ఆయన అన్నారు. 'జాతుల హింసపై మణిపూర్ కమిషన్ విచారణను వేగవంతం చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. హింసాత్మక ఘటనలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ, ఎన్‌ఐఏ తదితర ఏజెన్సీలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేయకూడదు' అని ఖడ్గే పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడటంతో పాటు సాధారణ పరిస్థితులను నెలకొనే ప్రయత్నాలు తక్షణమే ప్రారంభించాలని, అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాప్రతినిధులను, పౌర సంఘాల సభ్యులను బోర్డులోకి తీసుకోవాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో హింసను ఎందుకు అంతం చేయాలని మోదీజీ కోరుకోవడం లేదని రాష్ట్ర ప్రజలు అడుగుతున్నారని ఖడ్గే అన్నారు.

అమాయకులను శిక్షించడమే వారి పని

యూపీ ప్రభుత్వంపై ప్రియాంక మండిపాటు

లక్నో: అమాయకులను హింసించడం, నేరస్థులను రక్షించడం ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ సర్కారుకు ప్రాథమిక మంత్రం గా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ విమర్శించారు. ఈ మేరకు ఆమె ఫేస్‌బుక్ పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. రాయ్‌బరేలీలో పబ్లిక్ ఫెసిలిటీ సెంటర్ నిర్వాహకుడు రవి చౌరాసియా నుండి రూ. 8 లక్షలు దోచుకున్నారు. దుండగులు అతని వద్ద ఉన్న డబ్బును లాక్కొని పారిపోయారు. కొన్ని కారణాల వల్ల వారు బ్యాగ్‌ను రోడ్డుపక్కన వదిలివేశారు. ఆ బ్యాగ్‌ని గుర్తించిన దీపు అనే వ్యాపారి కొంత మందితో కలిసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించడానికి వెళ్లగా... అతడిని అన్యాయంగా అరెస్టు చేసిన సంఘటనను ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రస్తావించారు. రాయబరేలీలోని జమునిపూర్ చారుహార్‌లో నివాసం ఉంటున్న గౌరవ్ అలియాస్ దీపు డబ్బు ఉన్న బ్యాగ్‌ను డిపాజిట్ చేయడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు. కానీ దోపిడి అతడే చేశాడన్న ఆరోపణలపై అన్యాయంగా జైలు పాలయ్యాడు. ఆగస్టు 26న దీపును అరెస్టు చేయడంతో స్థానికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. విచారణ అనంతరం అతను నిర్దోషని తేలడంతో శనివారం సాయంత్రం అతడిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ప్రియాంక ట్వీట్ చేస్తూ... ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు 'జోక్'గా మారాయని ధ్వజమెత్తారు.

పండగ వేళ విమాన టికెట్ ధరలపై హెచ్చరిక

విమానయాన సంస్థలకు చెప్పామన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: పండగల సీజన్‌లో దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునే వారంతా సొంతూళ్లకు పయనమవుతుంటారు. అదే అదనుగా ఆ సమయంలో విమాన టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతుంటాయి. దీనిపై తాజాగా కేంద్రం స్పందించింది. టికెట్ ధరలపై ఒక కన్నేసి ఉంచినట్లు తెలిపింది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ...'పండగ సీజన్‌లో ఎక్కువమంది ప్రయాణించే మార్గాల్లో విమానయాన సంస్థలు వసూలు చేస్తున్న టికెట్ ధరలను మేం గమనిస్తున్నాం. పండగ సమయంలో ప్రతి ఒక్కరూ ఇంటికి వెళ్లాలని కోరుకుంటారు. అలాంటి వేళ ప్రయాణికులకు అసౌకర్యం కలగకూడదని ఇప్పటికే అన్ని విమానయాన సంస్థలకు చెప్పాం. ఏ సంస్థనూ ఒకే విధమైన టికెట్ ధర వసూలు చేయాలని ఒత్తిడి చేయం. అయితే ధరలు మరీ ఎక్కువగా లేకుండా చూసుకోవాలి' అని మంత్రి వ్యాఖ్యానించారు. కోవిడ్‌తో దెబ్బతిన్న విమానయాన రంగం పూర్తిగా కోలుకోలేదు. అందుకు దేశీయ స్పైస్‌జెట్ ఒక ఉదాహరణ. అది ప్రస్తుతం ఆర్థిక కష్టాలు, న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ నిధుల సమీకరణ పనిలో పడింది. ఇలాంటి సమయంలోనే ఇండియా రీజినల్ ఎయిర్ మొబిలిటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. స్పైస్‌జెట్ పరిస్థితిని గమనిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ రంగం భవిష్యత్తు కోసం ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. '2035 నాటికి భారత్ అతిపెద్ద ఏవియేషన్ మార్కెట్‌గా అవతరిస్తుంది. ఈ వృద్ధికి తోడ్పాటునందించేందుకు రానున్న 10 నుంచి 20 ఏళ్లలో దేశంలో 350 నుంచి 400 విమానాశ్రయాలను నిర్మించాలని ప్రణాళిక రచిస్తున్నాం. మౌలిక సదుపాయాలపై మేం భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. భవిష్యత్తు మార్కెట్ కోసం ఇప్పుడే పునాది వేస్తున్నాం' అని తెలిపారు.

గొంతు తగ్గించండి: సీజేఐ

న్యూఢిల్లీ: కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనపై సోమవారం సుప్రీంలో విచారణ జరిగింది. ఆ సయమంలో ఓ లాయర్ తన వాదనలు వినిపిస్తూ బిగ్గరగా అరిచారు. అప్పుడు చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకున్నారు. స్వరాన్ని తగ్గించుకోవాలంటూ ఆ లాయర్‌ను హెచ్చరించారు. దీంతో ఆ లాయర్ క్షమాపణలు చెప్పారు. వాదనలు జరుగుతున్న సమయంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ... నిరసన ప్రదర్శనలో ఓ లాయర్ రాళ్లు రువ్వినట్లు తన వద్ద ఫొటోలు, వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ సమయంలో అడ్వకేట్ కౌస్తవ్ భాగ్చి మాట్లాడుతూ... ఓ సీనియర్ న్యాయవాది కోర్టులో ఎలా అలాంటి వ్యాఖ్యలు చేస్తారని ప్రశ్నించారు. అదే సమయంలో చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ... కోర్టు బయట జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నారా, గడిచిన రెండు గంటల నుంచి మిమ్మల్ని గమనిస్తున్నానని, గొంతును తగ్గించి మాట్లాడాలంటూ పేర్కొన్నారు. ముగ్గురు జడ్జీల ముందు మీరు మాట్లాడుతున్నారని, మీరేమి జనాలను ఉద్దేశించి మాట్లాడటం లేదని సీజే తెలిపారు. సీజే హెచ్చరికతో లాయర్ క్షమాపణలు చెప్పారు. రాబోయే మంగళవారం లోపు వైద్యురాలి హత్యాచారం కేసుపై కొత్త రిపోర్టును సమర్పించాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఎంపాక్స్‌పై కేంద్రం అప్రమత్తం

స్క్రీనింగ్, టెస్టింగ్ సంఖ్య పెంచాలని రాష్ట్రాలకు ఆదేశం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కోరలు చాస్తున్న ఎంపాక్స్ వ్యాధిపై కేంద్రం సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. అనుమానిత వ్యక్తులందరికీ స్క్రీనింగ్, టెస్టింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్ చేయాలని సూచించింది. అనుమానిత, ధృవీకరించిన వ్యాధిగ్రస్తులకు చికిత్స చేయడానికి ఐసోలేషన్ కేంద్రాలను సిద్ధం చేయడానికి ఆసుపత్రులను గుర్తించాలని రాష్ట్రాలను కోరింది. ప్రతిరోజూ ప్రజారోగ్య సంసిద్ధతపై సీనియర్ అధికారులతో సమీక్షించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం... జనవరి 2022, ఆగస్టు 2024 మధ్య 120 దేశాల్లో కేసులు వెలుగు చూశాయి. దాదాపు లక్షకుపైగా కేసులు నమోదు కాగా... 220 మంది మరణించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాధిని హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. తాజాగా జారీ చేసిన హెల్త్ అడ్వైజరీ ప్రకారం మన దేశంలో ఇప్పటివరకు ఒక్క మంకీపాక్స్ కేసు కూడా నిర్ధారణ కాలేదు. కానీ అన్ని రాష్ట్రాలు ఈ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరించింది. ఆరోగ్యమంత్రిత్వ శాఖ సూచనలు పాటించాలని కోరింది. ఎయిర్ పోర్టుల్లో వ్యాధి అనుమానితులను గుర్తించేందుకు స్క్రీనింగ్ వేగవంతం చేసినట్లు కేంద్రం తెలిపింది. వారిని పరీక్షించేందుకు ఐసీఎంఆర్ పరిధిలోని పరిశోధనాశాలల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరించింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు చర్మ సంబంధిత వ్యాధులకు చికిత్స చేసే క్లినిక్స్‌పై దృష్టిపెట్టాలని సూచించింది. ప్రజల్లో భయాలు పోగొట్టి... వ్యాధి వ్యాప్తిపై అవగాహన కల్పించాలని కోరింది. అనుమానాస్పదంగా ఉన్న అన్ని కేసులను పరీక్షించి, ధృవీకరించిన రోగుల కోసం ఆసుపత్రులలో ఐసోలేషన్ సౌకర్యాలను కల్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది.

మంకీపాక్స్ ఇన్‌ఫెక్షన్ సాధారణంగా రెండు నుంచి నాలుగు వారాల పాటు ఉంటుందని, సపోర్టివ్ మేనేజ్‌మెంట్‌తో రోగులు కోలుకుంటున్నారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలైంగిక సంపర్కం, గాయపడిన వ్యక్తితో ప్రత్యక్ష సంబంధం లేదా సోకిన వ్యక్తి దుస్తులు లేదా బెడ్‌షీట్‌లను ఉపయోగించడం ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. జ్వరం, చలిగా అనిపించడం, కండరాల నొప్పి, తలనొప్పి, అలసట వ్యాధి లక్షణాలు. చాలా సందర్భాలలో దానంతటదే తగ్గుతుంది. కానీ కొందరిలో ఇది తీవ్రంగా ఉంటుంది. ఇప్పటి వరకు ఈ వ్యాధికి వ్యాక్సిన్ లేదా సూచించిన మందులు లేవు. రోగికి అతడి లక్షణాల ఆధారంగా మాత్రమే చికిత్స చేస్తారు. వైద్యులు యాంటీవైరల్ మందులు ఇవ్వడం ద్వారా రోగి వ్యాధిని నియంత్రిస్తారు.

రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్

భారీ పేలుళ్లకు కుట్ర?

లక్నో: ఆదివారం అర్ధరాత్రి ఉత్తరప్రదేశ్‌లోని కాళింది ఎక్స్‌ప్రెస్ రైలుకు ఘోర ప్రమాదం తప్పింది. రైలును బోల్తా కొట్టించేందుకు పెద్ద కుట్ర చేసినట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీకి వెళ్తున్న కాళింది ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ బిల్హార్ రైల్వే స్టేషన్‌కు కొంత దూరంలో ట్రాక్‌పై ఎల్‌పీజీ సిలిండర్ ఉండటాన్ని గమనించాడు. సిలిండర్‌ను చూసిన లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో రైలు సిలిండర్‌ను ఢీకొని కొద్దిదూరంలో ఆగిపోయింది. ఆ తర్వాత లోకో పైలట్ రైలును ఆపి ఆర్పీఎఫ్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో సిలిండర్‌తో పాటు పెట్రోల్ నింపిన బాటిల్, అగ్గిపుల్ల, బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. సిలిండర్ ఇంజిన్‌లో ఇరుక్కుని పేలకుండా ఉండిపోయిందని అధికారులు అన్నారు. అకస్మాత్తుగా అత్యవసర బ్రేక్‌లు వేయడం వల్ల రైలు పట్టాలు కూడా తప్పే ప్రమాదం ఉందన్నారు. దీని తర్వాత అన్వర్‌గంజ్-కాస్‌గంజ్ రైల్వే ట్రాక్‌పై కాళింది ఎక్స్‌ప్రెస్ 22 నిమిషాల పాటు నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఈ కేసును ఛేదించేందుకు ఫోరెన్సిక్ బృందాన్ని పిలిపించారు. ఆర్‌పీఎఫ్ కూడా దీనిపై దర్యాప్తు చేస్తోంది. రైలును బోల్తా కొట్టించేందుకు ట్రాక్‌లపై గ్యాస్ సిలిండర్లు పెట్టారా లేదా పేల్చేందుకు పెట్టారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

బీజేపీ పాలనలో యువత జీవితాలు నాశనం: పవన్ ఖేరా

న్యూఢిల్లీ: బీజేపీ పాలకులు యువత జీవితాలను నాశనం చేశారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అన్నారు. నిరుద్యోగం పెచ్చుమీరుతున్నా ఆ పార్టీ నేతలు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లలో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో పవన్ ఖేరా సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బీజేపీ తీరును తప్పుపట్టారు. గణాంకాలు స్పష్టంగా దేశ ప్రజల ముందున్నాయని, మీరు వీటిని చూడలేదా అని కేంద్ర పాలకులను పవన్ ఖేరా ప్రశ్నించారు. ఈ గణాంకాలతో మీకెందుకు ఉలుకని నిలదీశారు. నిరుద్యోగ తీవ్రత గురించి డేటా ఆధారంగా రాహుల్ మాట్లాడటంలో తప్పేముందని అన్నారు. నిరుద్యోగం ఎందుకు పెరిగిందో అధికారంలో ఉన్న మీరు వివరణ ఇవ్వాలని నిలదీశారు. మీరు యువత జీవితాలను నాశనం చేస్తుంటే దానిపై మాట్లాడటంలో తప్పేముందని, తాము తప్పకుండా ఈ విషయం చర్చిస్తామని స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ టెక్సాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో భారత సంతతికి చెందిన వారిని ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ భారత్ ఒకే ఆలోచనకు సంబంధించిందని ఆర్ఎస్ఎస్ భావిస్తుందని, కానీ తాము భారత్ విభిన్న ఆలోచనలకు వేదికగా భావిస్తామని చెప్పుకొచ్చారు.

మమత మేనల్లుడికి ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి ఎదురుదెబ్బ తగిలింది. అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఉపాధ్యాయ నియామక కేసులో ఈడీ జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ అభిషేక్ బెనర్జీ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈడీ తీరును సమర్థించింది. అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఎంపీ అభిషేక్ బెనర్జీ, ఆయన సతీమణి రుజీరా బెనర్జీ ... ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. టీచర్ కుంభణంలో ఎంపీ బెనర్జీ దంపతులకు పెద్దమొత్తంలో ముడుపులు అందాయని, కేసు విచారణ చేపట్టేందుకు ఢిల్లీకి రావాలని సమన్లు జారీ చేసింది. కాగా, ఈడీ జారీ చేసిన సమన్లపై అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ దర్యాప్తు చేసేందుకు ఢిల్లీకి రావాలని కోరారు. కేసు విచారణను కోల్‌కతాలోని తన నివాసంలోనే జరపాలని, ఢిల్లీకి రావాల్సిన అవసరం లేదని ఈడీని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తాజాగా, విచారణ చేపట్టిన కోర్టు అభిషేక్ బెనర్జీ పిటిషన్‌ను కొట్టి వేసింది. దీంతో ఆయన ఢిల్లీలోనే ఈడీ విచారణను ఎదుర్కోనున్నారు.

జోక్యం చేసుకోలేం

ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరాపై సుప్రీం

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతోన్న యుద్ధానికి సంబంధించిన అంశంపై దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇజ్రాయిల్‌కు భారత్ ఆయుధాలు, సైనిక పరికరాల ఎగుమతిని నిలిపివేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ కోర్టులో వ్యాజ్యం దాఖలైంది. దేశవిదేశాంగ విధానపరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఈ విధంగా ఆదేశిస్తే... ఆయుధాల ఎగుమతిలో భాగమైన సంస్థలు ఒప్పందాలు ఉల్లంఘించాయంటూ దావాలు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుందని, అందుకే ఆ సంస్థలను నిలువరించలేమని కోర్టు పేర్కొంది. ఇలాంటి విషయాలు విదేశాంగ విధానంపై ప్రభావం చూపుతాయని వ్యాఖ్యానించింది. అశోక్ కుమార్ శర్మ, మరికొందరు వ్యక్తుల తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిల్ వేశారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేసే భారతీయ సంస్థల లైసెన్సు రద్దు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని అందులో పేర్కొన్నారు.

పాము కాటుతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి

భువనేశ్వర్: దేశంలో పాము కాటు మరణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. తాజాగా ఒకే కుటుంబంలో ముగ్గురు బాలికలు పాముకాటుకు బలయ్యారు. వారి తండ్రి ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నారు. ఈ విషాదకర ఘటన ఒడిశాలోని బౌధ్ జిల్లాలో చోటుచేసుకుంది. బౌధ్ జిల్లా చరియాపలి గ్రామానికి చెందిన శాలేంద్ర మల్లిక్ కుటుంబం ఆదివారం రాత్రి ఇంట్లో నేలపై నిద్రించింది. అర్ధరాత్రి సమయంలో ఉన్నట్టుండి మల్లిక్, ఆయన ముగ్గురు కుమార్తెలకు ఏదో కుట్టినట్లు నొప్పిగా అనిపించి ఉలిక్కిపడి లేచారు. పక్కన పాము వెళ్తుండటాన్ని చూసిన శాలేంద్ర కుటుంబసభ్యులకు విషయం చెప్పాడు. స్థానికుల సాయంతో వెంటనే ఆ నలుగురిని ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే చికిత్స పొందుతూ ముగ్గురు చిన్నారులు స్మృతిరేఖ (12), శుభరేఖ (9), సురభి (3) ప్రాణాలు కోల్పోయారు. తండ్రి శాలేంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. చిన్నారుల తల్లి, సోదరుడు పాము కాటు నుంచి తప్పించుకున్నారు. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పాములు వీరిని కరిచి ఉంటాయని అనుమానిస్తున్నారు. ఒడిశాలో గత ఏడేళ్లలో పాము కాటు కారణంగా 5 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ఏటా దాదాపు 50 వేల మంది పాము కాటుకు బలవుతున్నట్లు కేంద్రం లోక్‌సభలో ఇటీవల వెల్లడించింది.

విషం చిమ్మడమే వైసీపీ పని

- జగన్‌పై సీఎం చంద్రబాబు ధ్వజం
- ముంపు ప్రాంతాల్లో 9వ రోజూ పర్యటన
- అన్నివిధాలా ఆదుకుంటామని బాధితులకు భరోసా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో 9వ రోజూ విస్తృతంగా పర్యటించారు. బాధితులతో మాట్లాడి ఓదార్చారు. వరద పరిస్థితులపై కలెక్టరేట్ లో ఉన్నతాధికారులతో మాట్లాడిన అనంతరం వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు సీఎం చంద్రబాబు బయలుదేరారు. భవానీపురం నుండి సితార సెంటర్ మీదుగా ఊర్మిళా నగర్ వెళ్లారు. అక్కడ జరుగుతున్న డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు. అనంతరం కబేళా సెంటర్ లో స్థానిక మహిళలతో మాట్లాడారు. వరద ప్రభావంతో తాము అన్నీ కోల్పోయామని, తమకు ఉపాధి చూపించాలని మహిళలు సీఎంను కోరారు. ప్రతి ఒక్కరినీ ఆదుకుంటానని, ఉపాధి కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ ఫ్లై ఓవర్ వద్దకు చేరుకొని, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అక్కడి నుండి మిల్క్ ప్రాజెక్ట్, చిట్టి నగర్, ఎర్రకట్ట మీదుగా మ్యాంగో మార్కెట్, సింగ్ నగర్ కు వెళ్లారు. సింగ్ నగర్ ఫ్లై ఓవర్ వద్ద బాధిత ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం నుండి అందుతున్న సహాయం గురించి ఆరా తీశారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడారు. "ప్రభుత్వానికి ఎన్నో కష్టాలు ఉన్నాయి. రూ.పదిన్నర లక్షల కోట్ల అప్పు చేసి జగన్ గద్దె దిగిపోయారు. వచ్చి ఈ బురదలో తిరిగి ఉంటే చేసిన పాపాలు కొంతయినా పోయేవి. కానీ బాధితులకు ఎటువంటి సహాయం చేయకపోగా... బెంగళూరులో కూర్చొని మాపై బురద జల్లుతున్నారు. ఇంత పెద్ద మహా యజ్ఞంలో ఎన్ని సవాళు ఎదురైనా అధిగమించుకుంటూ ముందుకెళ్తున్నాం. వరదల్లో నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం. వారికి ఆదాయం వచ్చే మార్గాలు కల్పిస్తాం" అని సీఎం వారికి భరోసా ఇచ్చారు. అర్బన్ యాప్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంచుతామన్నారు. సర్వస్వం కోల్పోయిన వారికి జత బట్టలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆప్కో, ఇతర సంస్థల వద్ద వస్త్రాలు తెచ్చి పంపిణీ చేస్తామన్నారు. వరద బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. అధిక వర్షాలు, గత పాలకుల పాపాలు ఇప్పుడు ప్రజలకు శాపంగా మారిందన్నారు. బుడమేరు నుంచి కొల్లేరుకు నీళ్లు వెళ్లకుండా కబ్జాలు చేశారన్నారు. సర్వశక్తులు ఒడ్డి ప్రజలను ఆదుకున్నామని... వైసీపీ నాయకుల అనుచరులకు చెందిన భారీ బోట్లు వరద సమయంలో నదిలోకి ఎలా వచ్చాయని, బోట్లకు లంగరు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ప్రతి రోజు మాపై విషం చిమ్ముతున్నారని, అయినా తనకు 7 లక్షల మంది వరద బాధితుల కష్టాలే కనిపిస్తున్నాయన్నారు. వరద బాధితులకు మనోధైర్యం ఇవ్వాలనేదే తన లక్ష్యమని, వరద ప్రాంతాల్లోని ఇళ్లలోని వస్తువులన్నీ పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలను కూడా మరమ్మతు చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం అక్కడి నుండి కలెక్టరేట్ వెళ్లి అధికారులతో సమీక్షించారు.

పడవల ఘటనపై దర్యాప్తు ముమ్మరం

మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకాశం బ్యారేజీ పడవలు ఢీకొట్టిన ఘటనపై దర్యాప్తును వేగవంతం చేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అందరికీ అన్నంపెట్టే అన్నదాతలకు నష్టం చేకూర్చడానికి ప్రయత్నించిన వారికి చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రి సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒక్కొక్కటి 40-50 టన్నుల బరువున్న ఐదు పడవలు అధిక వరద వస్తున్న సమయంలో ప్రకాశం బ్యారేజీకి చెందిన 67, 69, 70 గేట్లను దాటుకొని కౌంటర్ వెయిట్‌ని బలంగా ఢీకొట్టాయన్నారు. అదృష్టవశాత్తు బ్యారేజీకి సంబంధించిన ప్రధాన కట్టడానికి గానీ, గేట్లకుగానీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా కౌంటర్ వెయిట్ దెబ్బతిన్నట్లు తెలిపారు. అధిక బరువు కలిగిన బోట్లను సాధారణంగా నది ఒడ్డున లంగర్ వేసి ఉంచుతారని, ఒక్కో బోటు విలువ రూ.40-50 లక్షలు ఉంటే... అంతటి విలువైన 3 బోట్లను ఒకే ప్లాస్టిక్ తాడుతో కట్టడం చాలా అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. మొత్తం ఐదు పడవల్లో ఒక పడవ గేట్ల మధ్య నుంచి కిందకు వెళ్లిపోగా మూడు పడవలను గుర్తించారన్నారు. ఆ మూడు పడవలకు యజమాని ఒకరే కావడం అనుమానానికి దారితీస్తోందని, ఈ పడవల యజమాని ఉషాద్రి... కోమటి రామ్మోహన్ అనుచరుడిగా ఉన్నారని మంత్రి చెప్పారు. రామ్మోహన్ తలశిల రఘురామ్‌తో బంధుత్వం ఉండటం గమనార్హమని తెలిపారు. గత ప్రభుత్వ అండదండలతో నందిగం సురేశ్‌తో కలిసి సిండికేట్‌గా ఏర్పడి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను అక్రమంగా లూటీ చేశారని విమర్శించారు.

రాహుల్ మాటలతో ఏకీభవిస్తున్నా: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భిన్నత్వంలో ఏకత్వమే కాంగ్రెస్ భావజాలం అన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాటలతో పూర్తిగా ఏకీభవిస్తున్నానని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ అమెరికా పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ తెలుగు భాష గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాషలో చరిత్ర, సంస్కృతి, నృత్యం, ఆహారపు అలవాట్లు ఉన్నాయని, హిందీ భాషను తెలుగు రాష్ట్రాలపై రుద్దడమంటే తెలుగు భాషాధారకులను అవమానించడమేనని పేర్కొన్నారు. రాహుల్ చెప్పిన మాటలు అక్షర సత్యమని, దేశానికి ఒకే భావజాలం ఉండాలని కాంగ్రెస్ కోరుకోదని తెలిపారు.

నేటినుంచి దాశరథి శత జయంత్యుత్సవాలు

విశాలాంధ్ర- విశాఖ: అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో మంగళ, బుధవారాల్లో ఏయూ టీఎల్ఎన్ సభా వేదికపై కళా ప్రపూర్ణ, మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవాలు జరగనున్నాయి. మంగళవారం ఉదయం ప్రారంభ సభ, అనంతరం మూడు సదస్సులు... రెండవ రోజు రెండు సదస్సులు.. అనంతరం ముగింపు సభ జరగనుంది. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది సాహితీ ప్రముఖులు హాజరుకానున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన జి.హనుమన్న (59) సోమవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమన్న తన భార్య జమునమ్మ పేరు మీద 4.50 ఎకరాల పొలంతో పాటు మరో 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. కొన్నేళ్లుగా పంటల దిగుబడి సరిగా లేక పెట్టుబడి డబ్బు కూడా తిరిగి రాకపోవడంతో పూర్తిగా అప్పుల పాలయ్యాడు. పంట పొలాలసాగు కొరకు సుమారు రూ.15 లక్షల వరకు అప్పు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు.ఈ సంవత్సరం కురిసిన అధిక వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో చేసిన అప్పులు తీర్చలేనని మనస్థాపం చెంది రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. హనుమన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సంఘటన స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

ఏలేరు వరదపై కలెక్టర్‌తో పవన్ కల్యాణ్ సమీక్ష

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ/ గొల్లప్రోలు: కాకినాడ జిల్లాలో భారీ వర్షాలు, వాగులు... వంకలు... గోదావరి పొంగి ప్రవహిస్తుం డడంతో ఏలేరు ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద నీరు చేరింది. సమీప గ్రామాలు ముంపుబారిన పడడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పిఠాపురం, పత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాలు ముంపు వలయంలో చిక్కుకోవడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం మధ్యాహ్నం వరద ప్రాంతాల్లో పర్యటిం చారు. పిఠాపురం నియోజకవర్గం గొల్ల ప్రోలు జగనన్న కాలనీని సందర్శించారు.

రిజర్వాయర్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు కలెక్టర్ షణ్మోహన్ సగిలితో మాట్లాడుతూనే ఉన్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. సుద్దగడ్డ వాగు సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు నష్టపోయారన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయ న్నారు. కష్టాల్లో ఉన్న పంచాయతీలను ఆదుకుంటామన్నారు. బుడమేరుకు సంబం ధించిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా వంటి వ్యవస్థ కంటే ముందుగా ఆక్రమణలు చేసిన వారితో మాట్లాడాలి. బుడమేరు ఆక్రమణ లపై సమిష్టి నిర్ణయం తీసుకుంటామన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రాత్రింబవళ్లు పని చేస్తున్నారన్నారు. గొల్లప్రోలు జగనన్న కాలనీ తాము పడుతున్న కష్టాలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. సరైన దారి లేదని... వంతెనను నిర్మించాలని కోరారు. మౌలికసౌకర్యాలు లేవని, చిన్నపాటి వర్షానికే దారులు బురదమయం అవుతు న్నాయని వాపోయారు. మంచినీరు అందేలా చూడాలని కోరారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గత 50 సంవత్సరాలులో ఎప్పుడు లేనంత వర్షం కురిసిందన్నారు. వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్‌కు చెప్పినట్టు పేర్కొన్నారు. సహాయక చర్యలపై కలెక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ నేత కృష్ణంరాజు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికేసు

సుప్రీంకోర్టుకు దేవినేని అవినాశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో హైకోర్టు ముందస్తు బెయిల్‌కు నిరాకరించడంతో నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారు. సోమవారం వైసీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాశ్ ముందస్తు బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇప్పటికే ఆయనకు రాష్ట్ర హైకోర్టు ముందస్తు బెయిల్‌ను నిరాకరించడంతో.. సుప్రీంకోర్టులో అయినా ఊరట దక్కుతుందేమోనని అవినాశ్ ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు మొత్తం 14 మంది హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా... హైకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అలాగే సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో జోగి రమేశ్‌కు కూడా బెయిల్ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో పోలీసులు వీరందరినీ అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్న కొందరు నేతలకు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఇటీవల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను హైదరాబాద్‌లో, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని బెంగళూరులో అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ముఖ్య అనుచరులను కూడా అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీంతో విజయవాడకు చెందిన దేవినేని అవినాశ్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తాజాగా సుప్రీంలో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం దీనిపై విచారణకు జరిగే అవకాశముందని వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెండ్యాల శ్రీనివాస్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన ప్రణాళికా విభాగం సహాయ కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను తక్షణమే సర్వీసులోకి తీసుకుంటున్నట్లు ఆదేశాల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ సస్పెన్షన్ కాలాన్ని ఆన్ డ్యూటీగా పరిగణిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్‌లో వేర్వేరు అభియోగాలు పేర్కొంటూ పెండ్యాల శ్రీనివాస్‌ను వైసీపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ అభియోగాలపై శాఖాపరమైన విచారణ చేపట్టినట్లు పేర్కొన్న ప్రభుత్వం... ఆ అభియోగాలకు సంబంధించిన ఆధారాలేవీ లేకపోవటంతో ఆయన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. మరోవైపు సర్వీసు నిబంధనల్ని ఉల్లంఘించారంటూ జారీచేసిన సస్పెన్షన్ ఉత్తర్వులనూ ప్రభుత్వం ఎత్తివేసింది.

కాబోయే తొలి ట్రిలియనీర్ మస్క్

అదానీ తర్వాతే అంబానీ



న్యూఢిల్లీ: ప్రపంచంలో ఎంతోమంది కుబేరులు ఉన్నా అందరూ ప్రస్తుతానికి బిలియనీర్లే తప్ప... వ్యక్తిగతంగా ఏ ఒక్కరూ ట్రిలియనీర్ (కనీసం ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లు) హోదా అందుకోలేదు. ఈ కిరీటాన్ని అందుకోబోయే మొదటి వ్యక్తి మాత్రం స్పేస్ ఎక్స్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కాబోతున్నారని ఓ నివేదిక వెల్లడించింది. 2027 నాటికి ఆ ఘనత సాధించబోతున్నారని పేర్కొంది. ఆ మరుసటి ఏడాది గౌతమ్ అదానీ ఆ జాబితాలో చోటు దక్కించుకునే అవకాశం ఉందని తెలిపింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడైన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మాత్రం 2033లో ఆ ఘనత సాధించవచ్చని ఇన్‌ఫార్మా కనెక్ట్ అకాడమీ తన నివేదికలో అంచనా వేసింది. ప్రస్తుతం ప్రపంచ కుబేరుల జాబితాలో ఎలాన్ మస్క్ 237 బిలియన్ డాలర్ల సంపదతో మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన ట్రిలియనీర్‌గా అవతరించాలంటే... ఏడాదికి ఆయన సంపద సగటున 110 శాతం వృద్ధి చెందాల్సి ఉందని నివేదిక పేర్కొంది. అలాగే, ఈ జాబితాలో ప్రస్తుతం 13వ స్థానంలో ఉన్న అదానీ సంపద 100 బిలియన్ డాలర్లు కాగా... ట్రిలియనీర్ జాబితాలో చేరే రెండో వ్యక్తిగా ఆయన నిలవనున్నారని నివేదిక అంచనా వేసింది. పోర్టులు, విద్యుత్ వంటి వివిధ వ్యాపార విభాగాల్లో కొనసాగుతున్న అదానీ... సగటున 123 శాతం వార్షిక వృద్ధి సాధించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ ప్రస్తుత సంపద 111 బిలియన్ డాలర్లు కాగా... ట్రిలియనీర్ జాబితాలో చేరాలంటే మాత్రం 2033 వరకు వేచి చూడాల్సిందేనని నివేదిక తెలిపింది. అలాగే, ఆయనకు చెందిన వ్యాపార విభాగం రిలయన్స్ ఇండస్ట్రీస్ ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ పరంగా 2035 నాటికి ఆ ఘనత సాధించగలదని అంచనా కట్టింది. తైవాన్‌కు చెందిన సెమీ కండక్టర్ తయారీ సంస్థ టీఎస్ఎంసీ (ప్రస్తుత విలువ 893.7 బిలియన్ డాలర్లు) 2025 నాటికే ఈ ఘనత సాధించబోతున్నది. దీంతో పాటు బెర్క్‌షైర్ హాథ్‌వే, ఫార్మా కంపెనీ ఎలీ లిల్లీ, టెక్నాలజీ కంపెనీ బ్రాడ్‌కామ్, ఆటోమొబైల్ సంస్థ టెస్లా కూడా త్వరలోనే ఈ ఘనత అందుకోబోతున్నాయని నివేదిక తెలిపింది. ప్రపంచంలో ఏ ఒక్కరూ ఇప్పటి వరకు ట్రిలియనీర్ హోదా సాధించలేదని, ఎలాన్ మస్క్, గౌతమ్ అదానీ, ఎన్విడియా వ్యవస్థాపకుడు జన్‌సెన్ హాంగ్, ఇండోనేషియా వ్యాపారవేత్త ప్రజాగో పెంగెస్తు, ఫ్రాన్స్‌కు చెందిన బెర్నాల్డ్ ఆర్నాల్ట్, ఫేస్‌బుక్ సీఈఓ జుకర్‌బర్గ్ వంటి వారు త్వరలో ఆ ఘనత సాధించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, యాపిల్, అల్ఫాబెట్, అమెజాన్, సౌదీ ఆరామ్‌కో, మెటా వంటి సంస్థలు ట్రిలియన్ డాలర్ల మార్కును అందుకున్నాయి.

ట్రంప్ వర్సెస్ హారిస్

నేడు ముఖాముఖి చర్చ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ... డెమోక్రట్, రిపబ్లికన్ అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతుండగా...ట్రంప్ కూడా అధికార పక్షంపై విమర్శలతో ప్రచారంలో వేగం పెంచారు. వీరిద్దరి మధ్య ప్రత్యక్ష సంవాదానికి రంగం సిద్ధమైంది. అధ్యక్ష పోరులో భాగంగా తొలిసారిగా వీరిద్దరూ ప్రత్యక్ష చర్చలో పాల్గొననుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య ముఖాముఖిని అమెరికా వార్తాసంస్థ ఏబీసీ న్యూస్ సెప్టెంబర్ 10(మంగళవారం)న నిర్వహించనుంది. అయితే, ట్రంప్-బైడెన్ మధ్య ఇది వరకు జరిగిన చర్చలో వారి మైక్‌లు మ్యూట్ చేయడంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో కొన్ని నిబంధనలతో ఆ వార్తా సంస్థ ముందుకు వచ్చింది. దీనికి ఇద్దరు నేతలు అంగీకరించినట్లు తెలిపింది. ఫిలడెల్ఫియాలోని నేషనల్ కాన్‌స్టిట్యూషన్ సెంటర్‌లో సెప్టెంబర్ 10 (అమెరికా కాలమాన ప్రకారం) రాత్రి 9.00 గంటలకు ట్రంప్-హారిస్ మధ్య ప్రత్యక్ష చర్చ జరగనుంది. ప్రేక్షకులు ఎవ్వరూ ఉండరు. ఏబీసీ న్యూస్ యాంకర్లు డేవిడ్ ముయిర్, లిన్సే డేవిస్ సమన్వయకర్తలుగా ఉంటారు. 90 నిమిషాల పాటు చర్చ జరగనుంది. మధ్యలో రెండుసార్లు స్వల్ప విరామం ఉంటుంది.

గణేశ్ ఉత్సవాల్లో అపశృతి

గుండెపోటుతో యువకుడి మృతి, కాలువలో బాలుడి గల్లంతు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: గణేశ్ ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. నంద్యాల నియోజకవర్గం ఆళ్లగడ్డ పట్టణ ఆశ్రమం వీధిలోని గంగమ్మ దేవాలయం వద్ద గణేశ్ మండపం వద్ద నృత్యం చేస్తూ...అశోక్ (32) అనే యువకుడు హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండె పోటుతో అశోక్ చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. కాగా ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో సోమవారం జరిగిన వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లాలు భాష (12) తెలుగు గంగ ప్రాజెక్టు కాలువలో పడి కొట్టుకు పోయాడు. గ్రామానికి చెందిన నలుగురు పిల్లలు వినాయకుని నిమజ్జనం వెంట వెళ్లగా నిమజ్జనం జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు బాలుడు నీటిలో కొట్టుకొని పోయాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అహోబిలంలోని టోల్ గేటు సిబ్బంది నీటిలో కొట్టుకొని పోతున్న ముగ్గురు పిల్లలను రక్షించగా... లాలు మాత్రం నీటి ప్రవాహంలో కొట్టుకొని పోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆళ్లగడ్డ రూరల్ ఎస్సై హరి ప్రసాద్, సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బీజేపీ ఆఫీసే లక్ష్యం

ఎన్ఐఏ చార్జిషీటు వెల్లడి

న్యూఢిల్లీ: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనపై ఎన్ఐఏ ఛార్జిషీట్ దాఖలు చేసంది. అందులో సంచలన విషయాలు వెల్లడించింది. నలుగురిని నిందితులుగా పేర్కొన్న ఎన్ఐఏ... ఈ ముష్కరుల తొలి టార్గెట్ బెంగళూరులోని మల్లేశ్వరంలో ఉన్న బీజేపీ కార్యాలయాన్ని పేల్చడమేనని తెలిపింది. అయోధ్యలో రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ట కార్యక్రమం రోజే బీజేపీ కార్యాలయంపై ఐఈడీ దాడికి విఫలయత్నం చేసినట్లు తెలిపింది. ఆ తర్వాతే రామేశ్వరం కేఫ్ పేలుడుకు కుట్ర పన్నారని వివరించింది. బెంగళూరు ఎన్ఐఏ కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో ఈ అంశాలను ప్రస్తావించింది. రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో ముస్సావిర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మథీన్ అహ్మద్ తాహా, మాజ్ మునీర్ అహ్మద్, ముజామ్మిల్ షరీఫ్‌లను నిందితులుగా చేర్చింది. వీరిలో షాజీబ్, తాహాలు ఐసిస్ రాడికల్స్ అని తెలిపింది. ఈ దాడుల కోసం డార్క్ వెబ్ నుంచి డౌన్‌లోడ్ చేసిన భారత్, బంగ్లాదేశ్ గుర్తింపు కార్డులను ఉపయోగించినట్లు గుర్తించింది. ఇప్పటికే అరెస్టయిన ఈ నలుగురూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు తెలిపింది. కాగా, మార్చి 1న బెంగళూరులోని ప్రఖ్యాత రామేశ్వరం కేఫ్‌లో బాంబు దాడి జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. మార్చి 3న ఈ కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎన్ఐఏ... వివిధ రాష్ట్రాల పోలీసు బలగాలు, ఇతర ఏజెన్సీల సమన్వయంతో ముమ్మరంగా దర్యాప్తు కొనసాగించింది. ఇందుకోసం సాంకేతిక, క్షేత్రస్థాయి పరిశోధనలు నిర్వహించింది. షాజీబ్ అనే నిందితుడు బాంబు అమర్చాడని విచారణలో వెల్లడైందని తెలిపింది. కర్నాటకలో టార్గెట్ హత్యలు, ఇతర జిహాదీ కార్యకలాపాలకు సంబంధించిన కుట్రలు 2020లో భగ్నం కావడంతో తాహాతో కలిసి షాజీబ్ పరారయ్యాడని తెలిపింది. రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటన జరిగి 42 రోజుల తర్వాత పశ్చిమ బెంగాల్‌లో దాక్కున్న ఈ నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

చంద్రబాబు అరెస్టుతోనే వైసీపీ పతనం: మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతోనే వైసీపీ పతనావస్థకు చేరిందని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎండీ ఫరూక్ చెప్పారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలను రాష్ట్ర ప్రజలు నమ్మలేదన్నారు. చంద్రబాబును అరెస్టు చేసిన నంద్యాల నుంచే సైకో అరాచక పాలనకు చరమగీతం పాడి ఓటు ఆయుధంతో సాగనంపారని తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది గడిచిందని... నాడు అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం తెలుపుతూ, ఆ అరెస్టును ఖండించాయన్నారు. దేశవ్యాప్తంగానే కాక 70దేశాల్లో చంద్రబాబుకు సంఘీభావంగా ప్రదర్శనలు చేశారని వివరించారు. ఐదేళ్ల జగన్ పాలన... నేరాలు, కక్షలు, కార్పణ్యాలతో కాలం వెళ్లబుచ్చితే, కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తోందని ఫరూక్ తెలిపారు.

పెయింటింగ్ గుర్తులు ఉంటే ఆక్రమణ కాదు: కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలు, పెయింటింగ్ గుర్తులపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. కేవలం పెయింటింగ్ గుర్తులు వేసినంత మాత్రాన ఆ ప్రాంతం ఆక్రమణకు గురైనట్లు కాదన్నారు. 'చైనా మన భూభాగాన్ని తీసుకోలేదు. రెండు దేశాల మధ్య స్పష్టంగా నిర్వచించని ప్రదేశాల్లో భారత్, చైనా బలగాలు గస్తీ ఒక్కోసారి పరిధిని మించి ఉంటుంది. అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టడం కుదరదు. మన వైపు నుంచి గట్టి నిఘా ఉంది. రెండు దేశాల మధ్య స్పష్టంగా నిర్వచించని ప్రాంతాల్లో పెయింటింగ్ గుర్తులు వేసినంత మాత్రాన ఆ ప్రాంతాలు ఆక్రమణకు గురైనట్లు కాదు' అని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను భారత్ చేపడుతోందన్న రిజిజు... భవిష్యత్తులోనూ కొనసాగిస్తామన్నారు. అయితే, వాస్తవాధీన రేఖ సమీపానికి ఎవరినీ రానీయబోమని చెప్పారు. లద్దాక్ సరిహద్దులో ప్రతిష్టంభనను తొలగించేందుకు అనేక దఫాల్లో చర్చలు జరుపుతున్న వేళ తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.